



స్వామి,అమ్మవార్లు శ్రీచక్రపెరుమాళ్లకు స్నపన నిర్వహిస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా.. శ్రీచక్రవార్యుత్సవం

ద్వారకాతిరుమల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజమాస దివ్యబ్రహ్మోత్సవాల్లో శనివారం ఉద యం ఆలయ యాగశాలలో శ్రీచక్రవార్యుత్సవం జరిగింది. మౌనబలి, ధ్వజా వరోహణ జరిగాయి. ఆలయ ఆవరణలో శ్రీవారు, అమ్మవార్లు, చక్ర పెరుమాళ్లను ఒక వేదికపై ఉంచి పూజాధికాలను జరిపి సుగంధ ద్రవ్యాలు, పంచపల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత జలంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. పంచామృతాభి షేకాన్ని జరిపారు. పూర్ణాహుతి హోమాన్ని జరిపారు. ఉదయం తొళక్క వాహనంపై జరిగిన స్వామివారి తిరువీధి సేవ చూపరులకు నేత్రపర్వమైంది. ప్రత్యేక అలంకారాల్లో భాగంగా యశోదా కృష్ణుడిగా స్వామివారు దర్శనమిచ్చారు.



యశోదాకృష్ణుని అలంకరణలో చినవెంకన్న



శ్రీచక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటరి పయనం

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

ఒకప్పుడు ఏ ఇంట్లో చూసినా పిల్లా పాపలతో కళకళలాడేది. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యల తోనే చిన్నారుల కాలక్షేపం. స్కూలుకు వెళ్లాలన్నా, రావాలన్నా వారే దగ్గరుండి తీసుకొచ్చేవారు. ఇంటి బాధ్యతలే కాదు.. సంసార పక్షంగా ఎదురయ్యే సమస్యలకు వారే రక్షణగా నిలిచేవారు. పిల్లలకు ఓ మార్గం చూపించే వరకు బండెడు చాకిరికి తలొగ్గేవారు. ఇంట్లో వారి మాటే శాసనం. శుభమైనా, అశుభమైనా వారు చెబితేనే చెల్లేది. అంతలా బంధాలు బలంగా ఉండేవి. ఇప్పుడు కాలం మారింది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలానే ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. ఎవరి బతుకు వారిది అన్నట్టు మారింది. ఒంటరి బతుకులపై ఆంధ్రజ్యోతి సండే స్పెషల్ స్టోరీ.. 6లో..

స్మార్ట్ మీటర్లు వచ్చేశాయ్!

విద్యుత్ సంస్థలో కొత్త సంస్కరణలు



ఏలూరు సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యుత్ సంస్థలోను కొత్త సంస్కరణలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యుత్ వినియోగదారు లకు సంబంధించి స్మార్ట్ మీటర్లు (డిజిటల్ మీటర్లు) ఏర్పాటు ప్రారంభమైంది. వీటి ఏర్పాటును ఒక కార్పొరేట్ సంస్థకు అప్పగించారు. వీటివల్ల నెలవారీ బిల్లింగ్ పెరుగుతుందని వినియోగదారులు ఆందోళన చెందుతుండగా,

ఉమ్మడి పశ్చిమలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

ఇప్పటికే ఉమ్మడి పశ్చిమలోని ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తయింది. ఇప్పుడు వాణిజ్య వినియోగదారులకు (వ్యాపార సంస్థలకు) స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోంది. రాబోయే రోజుల్లో గృహ విద్యుత్ కనెక్షన్లకూ ఏర్పాటు చేస్తాం. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లుల పెరుగుదల ఉండదు. కేవలం అపోహ మాత్రమే. విద్యుత్ పొదుపు సాధ్యమవుతుంది.

పి.సాల్మన్‌రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ, ఏలూరు సర్కిల్

- ఉమ్మడి పశ్చిమలో విద్యుత్ కనెక్షన్లు 16.26 లక్షలు
- ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పూర్తి
- ప్రస్తుతం వాణిజ్య సంస్థలకు ఏర్పాటు
- బిల్లులు పెరుగుతాయని వినియోగదారుల ఆందోళన
- అవి అపోహలే : విద్యుత్ శాఖ
- రాబోయే రోజుల్లో ప్రీపెయిడ్ ప్లాన్ అమలయ్యే అవకాశం

ఇవి కేవలం అపోహలు మాత్రమేనని విద్యుత్ సరఫరాను మెరుగుపరచడానికి, విద్యుత్ వినియోగం సక్రమంగా జరగడం కోసమే ఏర్పాటు చేస్తున్నట్టు విద్యుత్ శాఖ చెబుతోంది.

ఉమ్మడి పశ్చిమలో 16 లక్షల 26వేల 973 మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో తొలిదశలో ఆగస్టు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి 31,594 స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రారంభించి పూర్తి చేశారు. ప్రస్తుతం కేటగిరి-2కు సంబంధించి వాణిజ్య వినియోగదారులైన 1,59,356 మందికి చెందిన వ్యాపార సంస్థలకు సెప్టెంబరు 25 నుంచి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రారంభమైంది. ఈ ప్రక్రియ పూర్తయిన రాబోయే రోజుల్లో 13 లక్షల 607 మంది గృహ విద్యుత్ వినియోగదారుల ఇళ్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తారని ఏపీఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసినా విద్యుత్ బిల్లింగ్ గతంలో తీస్తున్నట్లుగానే మీటరు రీడర్లు ఈ స్మార్ట్ మీటర్లు నుంచి విద్యుత్ బిల్లులు తీస్తారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో బిల్లులు రెట్టింపవుతాయన్న ఆందోళన సామాన్య, మధ్యతరగతి విద్యుత్ వినియోగదారుల్లో కనిపిస్తోంది. అందుకే వీటి ఏర్పాటును వినియోగదారులు వ్యతిరేకించారు. అయితే స్మార్ట్ మీటర్లతో బిల్లులు పెరగవని ఇది కేవలం అపోహ మాత్రమేనని, గతంతో మాదిరిగానే విద్యుత్ బిల్లులు వస్తాయని విద్యుత్ శాఖ చెబుతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగానే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు జరుగుతోందని వారు చెబుతున్నారు.

భవిష్యత్‌లో ప్రీపెయిడ్ విధానం..!

ఇప్పటికే విద్యుత్ బిల్లులు చెల్లింపునకు సంబంధించి వినియోగదారుడు చెల్లించే విద్యుత్ బిల్లు మీదే క్యూఆర్ కోడ్ ఇస్తున్నారు. దానిని స్కాన్ చేసి వినియోగదారులు బిల్లు చెల్లించవచ్చు. రాబోయే రోజుల్లో విద్యుత్ వినియోగానికి కూడా సెల్‌ఫోన్ రీచార్జి మాదిరిగానే రీచార్జి చేసుకునే పరిస్థితి రాబోతోంది. ఇంకా మార్గదర్శకాలు విడుదల కాకపోయినా వినియోగ దారులే సెల్ ఫోన్ రీచార్జి మాదిరిగా ఎంత విద్యుత్ వినియోగం ఉంటే ప్రీపెయిడ్ విధానంలో అంత విద్యుత్‌ను రీచార్జి చేసుకుని వినియోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

విద్యుత్ పొదుపు లక్ష్యం

ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్‌లో పొదుపు సాధించవచ్చని, తద్వారా నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు సరఫరా చేయడానికి అవకాశాలు ఏర్పడతాయని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలోనే ఈ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు రాగా వినియోగదారుల నుంచి వ్యతిరేకత రావడంతో కొంత జాప్యం జరిగింది.



ఏలూరులో షాపులో కొత్త స్మార్ట్ మీటర్ బిగిస్తున్న సిబ్బంది





పాదగుర్తులను సేకరిస్తున్న భీమడోలు సీఐ, అటవీ అధికారులు

అదిగో..పులి

» ఎం.నాగులపల్లిలో కలకలం

ద్వారకాతిరుమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అదిగో...పులి అంటూ మండలంలోని ఎం.నాగులపల్లి ప్రాంత వాసులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. జిల్లాలో కొద్దిరోజుల కిందట పులి సంచారం ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఆపై దాని జాడ లేదు. అయితే ఎం.నాగులపల్లిలోని పాత కొవ్వూరు రోడ్డు సమీపంలోని బ్రిక్స్ ఫ్యాక్టరీ పక్క నుంచి శనివారం కాస్త చీకటి పడిన తర్వాత పులి వెళ్తుండగా చూశామంటూ కొందరు వ్యక్తులు భయాందోళనతో పోలీసులకు ఫోన్‌లు చేశారు. దీంతో పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు ఈ వార్త పరిసర ప్రాంతాల్లో దావానలంలా వ్యాపించింది. స్థానికులు అటువైపుగా వెళ్లాలంటే వణికి పోతున్నారు. అయితే ఇది పుకార్లని కొందరు కొట్టి పాడేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న భీమడోలు ఎస్ఐ స్పందించి ఇద్దరు పోలీసులను అక్కడికి పంపి విచారించారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భీమడోలు సీఐ విల్సన్, అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పాదగుర్తులను పరిశీలించి పులివేనని నిర్ధారించారు.

సొసైటీలకు ఆక్సిజన్

- వచ్చే ఆరు నెలల్లోపే ఎన్నికలు
- ఈలోపే త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు వీలుగా సన్నాహాలు
- డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు నామినేటెడ్
- భీమవరం నేత కోళ్ళ నాగేశ్వరరావు పేరు ప్రస్తావన
- త్వరలోనే కూటమి కీలక నిర్ణయం



కోళ్ల నాగేశ్వరరావు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

సహకార సంఘానికి ఆయువుపట్టు అయిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో సొసైటీలకు జీవం పోయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. వీలైతే వచ్చే ఆరునెలల్లోపే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని తలపెట్టారు. ఈలోపే సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసి వీటి పర్యవేక్షణలోనే ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నారు. డీసీసీబీ చైర్మన్‌గా, డైరెక్టర్లుగా ఇప్పటికే అనేకమంది ఆశలు పెంచుకున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సహకార రంగంలో మరో మార్పు చేర్పు త్వరలోనే జరగబోతుంది. ఇప్పటిదాకా సహకార సంఘాల్లో అత్యధికం బలహీనపడ్డాయి. ఒకప్పుడు సహకార సంఘాల నుంచి లభించే పంట రుణాల మీదే రైతులు ఆధారపడేవారు. రెండు పంటలకు అవసరమైన స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలకు ఈ సొసైటీలే ఆసరా అయ్యేవి. గడిచిన 2014-19 మధ్య అధికారంలో ఉన్న తెలుగుదేశం అప్పట్లోనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి కొంత ఊపిరి పోసింది. ఆ తర్వాత అధికార పగ్గాలు చేపట్టిన వైసీపీ సహకార వ్యవస్థను పూర్తిగా గాలికొదిలేసింది. దీనికితోడు మార్పులు, చేర్పులంటూ సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం పోయి ఆ స్థానంలో త్రిసభ్య కమిటీలను నియమించింది. ఆఖరుకి డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు చైర్మన్‌లను నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేసిందే తప్ప ఎన్నికలకు చర్యలు తీసుకోనేలేదు. గడిచిన ఐదేళ్లుగా సహకార సంఘం అదుపు తప్పింది. అనేక సొసైటీల్లో చేతివాటం చూపారు. రుణాలు చెల్లింపులు, వసూళ్లల్లోను వృద్ధి కంటే క్షీణతే ఎక్కువ. ఆఖరుకి సహకార సంఘాలను పర్యవేక్షిస్తున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేక చతికిలపడ్డారు. జగన్ పాలనలో టి.నర్సాపురం సొసైటీ సీఈవో మీద చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. కనీసం సహకార సంఘాల్లో ఏం జరుగుతుందో నిత్యం పర్యవేక్షించాల్సిన డీసీసీబీ అంటీముట్టనట్టుగా వ్యవహరించింది. డీసీసీబీలోను రుణాల వ్యవహారంలో కొంత గందరగోళమే కనిపించింది. ఇప్పుడు కథ మారుతోంది. రాబోయే ఆరు నెలల్లోనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం చంద్రబాబు తాజాగా ప్రకటించారు. వాస్తవానికి గడిచిన ఐదేళ్లల్లో ఉన్న పరిస్థితులను కూటమి ప్రభుత్వంలో చక్కదిద్దుతారన్న భావన లేకపోలేదు. సొసైటీలకు తిరిగి త్రిసభ్య కమిటీలు వేయడం, వీటి ద్వారా ఒక నిర్దిష్ట పాలన జరిగేలా ప్రభుత్వం జాగ్రత్త పడుతోంది. టీడీపీలో కొంతమంది డైరెక్టర్ పదవులకు, ఇంకొంత మంది చైర్మన్ పదవిపై ఆశలు పెంచుకున్నారు. ఈ క్రమంలోనే చింతలపూడి, పోలవరంతో సహా అనేక నియోజక వర్గాలకు పార్టీ పరిశీలకుడిగా వ్యవహరించడమేకాకుండా లోకేశ్ యాత్రలో పోలీసుల అక్రమ కేసులతో పాటు హత్యాయత్నం కేసులను ఎదుర్కొన్న సొసైటీ అధ్యక్షుడు కోళ్ళ నాగేశ్వరరావు డీసీసీబీ చైర్మన్ పదవిని ఆశిస్తూ వస్తున్నారు. పార్టీకి విస్తృత సేవలు అందించడమే కాకుండా కష్ట కాలంలో తాను అక్రమ కేసులను ఎదుర్కొన్న విషయాన్ని సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, రామానాయుడు, లోకేశ్ ఎదుట వినిపించారు. ఇప్పుడు తాజాగా సహకార సంఘాల ఎన్నికల ప్రస్తావన సీఎం నోటి వెంటే వెలువడడంతో తిరిగి డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవుల విషయంలోను రాజకీయంగా ప్రచారం జోరందుకుంది. ఈలోపే త్రిసభ్య కమిటీలతో పాటు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులకు కొందరిని నామినేట్ చేసేందుకు త్వరలోనే ప్రక్రియ ఆరంభం కానుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో దాదాపు 250కు పైగానే సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లాల విభజన జరిగినా ఉమ్మడిగానే డీసీసీబీ, డీసీఎం ఎస్ కొనసాగుతున్నాయి. జిల్లాల విభజన ప్రాతిపదికగా భవిష్యత్తులో సహకార ఎన్నికలు జరగ బోతున్నాయా, లేదా అనేది కూడా ఒక స్పష్టత రానుంది.



ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు పూర్తి

» 22న ఉంగుటూరులో ప్రారంభించనున్న మంత్రి మనోహర్

ఏలూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సార్వా వరి మాసూళ్ల ప్రక్రియ ప్రారంభమయింది. జిల్లాలో ఈనెల 22వ తేదీ నుంచి ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించటానికి జిల్లా పౌర సరఫరాల సంస్థ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆ రోజున ఉంగుటూరులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనో హర్ ఈ-ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో 250 రైతు సేవా కేంద్రాల ద్వారా 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయా లని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ -

-7లో

కలల సౌధం.. శిథిలం!

» వందేళ్ల జూట్‌మిల్లుకు బైబై

» నిర్మాణాల కూల్చివేత ఆరంభం

» రెండేళ్ల క్రితమే లాకౌట్

» వేలాది మంది రోడ్డుపాలు





జూట్‌మిల్లులో కట్టడాల తొలగింపు పనులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

రెండేళ్ల కిందటి వరకు ఏలూరు నగరంలో ఓ సైరన్ వినిపించేది. అంతే క్షణాల్లో కార్మికులంతా అక్కడకు చేరేవారు. అప్పట్లో ఆ మిల్లులో పని చేస్తున్నామంటే అదో కళ. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆ మిల్లే నిండైన వెసులుబాటు. పెద్దగా చదువు అక్కర్లేదు. కష్టపడే గుణం ఉంటే చాలు. రోజుకి ఎనిమిది గంటలు చొప్పున అంతో ఇంతో జీతం ఇచ్చేవారు. ఉమ్మడి పశ్చిమలో ఇదే అతి పెద్ద పరిశ్రమ కూడా. తొలినాళ్ళల్లో వందల సంఖ్యలో ఉండే కార్మికులు ఆ తర్వాత క్రమేపీ వేల మందికి చేరారు. ఏలూరు నగరం నడిబొడ్డున ఉండే జూట్‌మిల్లు హిస్టరీ ఇది. ఎంతో ఘన చరిత్ర ఉన్న ఈ మిల్లుకు ఇప్పటికే లాకౌట్ ప్రకటించగా తాజాగా నిర్మాణాల కూల్చివేత చేపట్టారు. ఒకప్పటి శివగోపాల్ లునాని, ఆయన కుటుం బం దశాబ్దాల తరబడి ఈ మిల్లును నిర్వహిం చారు. పెద్ద ఎత్తున జూట్ ఉత్పత్తులను దేశం నలుమూలలకి సరఫరా చేసేవారు. గోనె సంచు లు, పురికోసలను ఉత్పత్తి చేసేవారు. ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడికి మా ర్కెటింగ్ చేసేవారు. ఆ క్రమంలోనే మిల్లులో పనిచేసే వారం దరికీ ఆది నుంచి కార్మిక నియ మ నిబంధనలను అమలు చేసేవారు. అయినా రానురాను పరిశ్రమలో కార్మికులు అనేకమార్లు తమ హక్కుల కోసం పోరాడాల్సి వచ్చింది. ఉమ్మడి పశ్చిమలో అతి పెద్ద పరిశ్రమగా 120 ఏళ్ళకు పైగా చరిత్ర కలిగిన జూట్‌మిల్లు 1904లో అంకురార్పణ జరిగింది. అప్పటి నుంచి ఏలూరులో వేల కుటుంబాలకు ఈ పరిశ్రమే దిక్కు. అక్కడ పనిచేసే కార్మికులందరికీ ఎక్కడా అనారోగ్యం రాకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ఇలా సాగిన ఈ జూట్‌మిల్లు 2022లో మూత పడింది. జూట్ ఉత్పత్తులు మార్కెటింగ్ లేకపోవడం, పరిశ్రమ నిర్వహణ భారం కావడం, ఇతరత్ర కారణాలతో దీనిని మూసివేశారు. వేలాది మంది కడుపు నింపిన ఈ పరిశ్రమను తిరిగి తెరిపించాలని సీఐటీయూతో సహా అనేక కార్మిక సంఘాలు పట్టు పట్టాయి. కాని అది సాధ్యం కాలేదు. దశాబ్దాల తరబడి వేలాది మందికి జీవం పోసిన జూట్‌మిల్లు కట్టడాలను గత రెండు రోజులుగా తొలగించడం ప్రారంభించారు. తమ కలల సౌధం కుప్పకూలుతుంటే ఇక్కడ పనిచేసిన అనేకమంది ఈ దృశ్యాన్ని చూస్తూ కలవర పడ్డారు.

అల్పపీడన హెచ్చరికలు.. రైతుల్లో ఆందోళన

ఏలూరుసిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో ఇంకా వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఈనెల 22వ తేదీన మళ్ళీ అల్పపీడన ద్రోణి బంగాళాఖాతంలో ఏర్పడుతుందనే హెచ్చరికలతో రైతులలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో ఇప్పటికే కొన్ని మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయి. వర్షాలు భారీగా కురిస్తే చేతికి అందివచ్చిన వరి పంట దక్కే అవకాశాలు ఉండవని రైతులు వాపోతున్నారు. గడచిన 24 గంటలలో జిల్లాలోనే అత్యధికంగా మండవల్లి మండలంలో 48.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 5.1 మి.మీ నమోదైంది. కలిదిండి 45.6, కైకలూరు 18.4, చింతలపూడి 11.2, ముదినేపల్లి 10.8, ఆగిరిపల్లి 3.6, భీమడోలు 2.2, పెదపాడు 1.8, నిడమర్రు 1, లింగపాలెంలో 0.4 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

పెండింగ్‌లోని కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు : కలెక్టర్

ఏలూరు సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి పరిష్కారానికి ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. లోకాయుక్త, జాతీయ , రాష్ట్ర మానవహక్కుల సంఘం, జాతీయ ఎస్సీఎస్టీ కమిషన్, హైకోర్టు తదితర కోర్టుల నుంచి అందిన కేసులపై జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కోర్టు కేసుల పెండింగ్ అంశాలపై ప్రతీ శనివారం సమీక్షిస్తామన్నారు.



అలవాటు చేసుకున్నా

నా వయస్సు 68 ఏళ్లు. ఆర్థిక స్థోమత లేకపోయినా పిల్లలను బాగా చదివించా. రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లలను ఉన్నత విద్యకు పంపా. వారంతా విదేశాల్లో స్థిరపడ్డారు. ఎదిగిన పిల్లలను చూసి సంబరపడ్డా. వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఇప్పుడు బాధపడుతున్నా. నాలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. వ్యాపారం చేశా. పిల్లలకున్నీ ఇచ్చా. పెళ్లి కాక ముందే పిల్లలపై మనకి హక్కు.. పెళ్ళైతే ఎవరి జీవితం వారిదే. పట్టించుకున్న వారెవరు. దేవుడి మీద భారం వేసి ఒంటరిగా బతుకేందుకు అలవాటు చేసుకున్నా. ఈ జన్మకిది చాలు.

- మోహన్‌రావు



ఒంటరి బతుకులు

ఉన్న ఊరు.. పుట్టి పెరిగిన ఇంటిని వదిలి ఉండలేక, అటు పిల్లల వద్దకు వెళ్లలేక, తరుముకొస్తున్న వృద్ధాప్యాన్ని జయించలేక మదన పడుతున్న వారి సంఖ్య ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పెరుగుతోంది. 80వ పడిలో పడిన వారందరికీ ఇప్పటి జీవితం ఒక ప్రత్యక్ష నరకం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లిన నాడు ఎవరో ఒకరు బాధ్యత భుజానకెత్తుకుని తమ వాళ్లకి ఏం వచ్చినా దండుగా నిలిచేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఒక్కసారిగా అదృశ్యమైంది.

పల్లె, పట్నం ఇప్పుడు తేడా లేదు.. వయస్సు మళ్లితే ఇకంతే.. రెక్కలొచ్చి పిట్టల్లా పిల్లలు

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కాలం మారుతోంది. పెద్దరికం స్థానం మారుతోంది. పల్లె అయినా, పట్నమైనా.. కొందరివి ఒంటరి బతుకులే. ఒకనాడు కుటుంబ సభ్యులతో కళకళలాడిన ఇళ్లన్నీ ఇప్పుడు ఈసురోమంటున్నాయి. అద్దాల్లోనే కాని పిల్లలు గెడ్డలొస్తే కాదనే సామెత ఇప్పుడు అక్షరాలా చాలా మందికి వర్తిస్తుంది. ఉద్యోగం కోసమో, చదువుల కోసమో, సంసార బాధ్యతల కోసమో అన్వేషిస్తూ తల్లిదండ్రులకు దూరంగా వెళుతున్న వారెందరో. నెలకో, ఆరు నెలలకో ఒకసారి వచ్చి మనసారా పలకరించే వారే లేరు. రోగం వచ్చినా, రొస్టొచ్చినా.. ఊళ్లో ఆర్ఎంపి ఉన్నాడు. ఆయనను అడిగి మందులేసుకో అదే తగ్గిపోతుంది.. అంటూ ఫోన్‌లోనే తల్లీదండ్రికి సూచనలు చేసే పిల్లలెంత మందో. కాని తమకు నలతగా ఉందని, మంచం దిగలేకపోతున్నామని, కనీసం ఎవరూ సాయపడే వారు కూడా లేరని నొక్కినొక్కి మరీ చెప్పినా అదంతా గోసే అవుతుంది. రానురాను బంధాలు, భావబంధాలు మరింతగా అల్లుకుపోవడానికి బదులుగా క్రమేపీ శిథిలమవుతున్నాయి.

కుటుంబాలు విచ్ఛిన్నం

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. వాటి స్థానంలో ఒంటరి కుటుంబాలు పుట్టుకొచ్చాయి. పెళ్ళై పట్టుమని వారం గడవక మునుపే.. అమ్మా మేం వేరే కాపురం ఉంటామంటూ పుట్టిన బిడ్డల నోటి వెంట వెలువడుతున్న మాటలకు తల్లిదండ్రులంతా అలవాటు పడిపోయారు. ఆర్భాటంగా పెళ్లి చేసినా, అష్టకష్టాలు పడి చదివించి పెద్ద చేసిన తామే అందరికీ ఓ బరువు.. ఓ అడ్డంకి అన్నట్టు బిడ్డల నోటి వెంట వెలువడుతున్న మాటలు గుండెల్లో గుచ్చుకుంటుంటే గమ్మున ఉండే వారెంత మందో. ఇక అక్కడి నుంచి మొదలైన జీవిత నాటకం ఇంటి పెద్దలకు జీవిత చరమాంకం నరకంగా మారుతోంది. ఒంటరి ప్రయాణం అటవాటవుతోంది. అదీ ఇదీ కాదంటే వృద్ధుల శరణాలయాల్లో చేతి నిండా డబ్బున్నోళ్లకు ఓ రీతిన.. చేతిలో చిల్లి గవ్వ లేని వారికి ఇంకో రీతిన అక్కున చేర్చుకుంటున్నారు. రాత్రనక, పగలనకా తాము పడిన కష్టాలు మదిలో కదులుతుంటే, కళ్లమ్మటే నీళ్లవుతుంటే.. మూడో కంటికి తెలియకుండా ఒంటరిగా వేదనతో, నిస్సహాయతతో కూలబడి ఆ దేవుడెప్పుడు తీసుకుపోతాడో అంటూ గుండెనిండా ఆర్ద్రతతో కుమిలిపోయే వారికి లోటే లేదు.

ఊరు మారింది

ఒకప్పుడు పల్లెల్లో అంతా ఒకటై ఉండేవారు. రానురాను అక్కడి పరిస్థితులు మారాయి. పార్టీల వారీగా, కులాల వారీగా కుటుంబాలు చీలిపోయాయి. ఎవరైనా హఠాత్తుగా కాలం చేసినా కాడిపట్టే వారు కొందరే. బతికినన్నాళ్ళు మమ్మల్ని పట్టించుకోలేదని ఆఖరికి నిష్ఠూరమాడే వారే కనిపిస్తారు. ఒకప్పుడు పల్లె పట్టు కాస్తా ఇప్పుడు సడలిపోయింది. కుటుంబాల మధ్య చీలిక ఒక ఎత్తయితే, ఏ కుటుంబానికి ఆ కుటుంబం ఒంటరిగా మారడం, పిల్లలు రెక్కలొచ్చి బతుకు తెరువు కోసం వేరే ప్రాంతాలకు ఎగిరిపోవడంతో పండుటాకులకు కష్టంగా మారింది. ఒంటరి బతుకులకు ఇది ఆలవాలమైంది. ఇంటి పెద్ద దిక్కు కోల్పోతే ఆ ఇంటి ఇల్లాలు ఒక్కరే మిగిలారు. పదకొండవ రోజు ఆ కార్యంకు దూరంగా ఉన్న పిల్లలు, వారి పిల్లలు అందరూ తండోప తండాలుగా వచ్చారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయామంటూ అంతా మదన పడ్డారు. కన్నీటిపర్యంతమయ్యారు. 'అంతలోనే అమ్మా వెళ్తొస్తాం.. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో' అంటూ ఒకరు. 'అసలే పెద్దోళ్ళయ్యారు. ఏ చిన్నాచితక జలుబు గిలుబు వచ్చినా ఆసుపత్రికి వెళ్ళు. వెనకాడకు' అంటూ ఇంకొకరి ధైర్య వచనాలు. ఏమొచ్చినా మేమున్నాం కదా ఫోన్ చెయ్యి చాలు ఇంకొకరు భరోసా. ఒకరి తర్వాత మరొకరు అంతా నిష్క్రమణ. ఇంట్లో మిగిలిందల్లా వయసు మీద పడి.. గుండెలనిండా బాధలు అలుముకుని భవిష్యత్ ఏమిటో తెలియక.. బావురమందామన్నా పెద్దరికం అడ్డొచ్చి గొంతెలో ఏదో అడ్డుపడ్డట్టు ఆ ఇంటి పెద్దావిడ పరిస్థితి. ఇంతలా కుటుంబాలకు కుటుంబాలే ఒంటరితనాన్ని ఆవహిస్తున్నాయి.

ఇదే నా.. జీవితం

నా వయస్సు 69 ఏళ్ళు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. మావారు కన్నుమూసిన తరువాత నానా తిప్పలు పడి పిల్లలను ప్రయోజకులను చేశా. అన్నీ సమ కూర్చా. ఆయన పోయిన తర్వాత ఎవరూ నన్ను పట్టించుకోలేదు. పిల్లలు వేరేచోట ఉంటున్నారు. నేను వారి దగ్గరకు వెళ్లి ఉండలేను. పుట్టిన ఊరిపై మమకారం చంపుకోలేను. ఒంటరిగా బతుకుతున్నా. వయస్సు మీద పడి నానా తిప్ప లు పడుతున్నా. అయినా అలవాటు చేసుకున్నా. సొంత ఊరైతే ఎలాగోలా పొద్దుపోతుంది. పట్నం లో అయితే అలా కాదు కదా. కనీసం నన్ను చూడడానికి కూడా కన్నబిడ్డలే వంతు లేసుకుంటున్నారు. ఇదే నా జీవితం.

- సత్యవేణి



పాద పూజలు

ఆటల పోటీలు

అవ్వా తాతల దినోత్సవం

ఉంగుటూరు/పెదపాడు/బుట్టాయగూడెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన తర్వాత.. తాత, నాయనమ్మలు దూరమయ్యారు. పండుగకో పబ్బానికో ఓసారి వెళ్లి పలకించడమే తప్ప వారి ప్రాధాన్యాన్ని ఈ తరం పిల్లలు మర్చిపోతున్నారు. గ్రాండ్ పేరెంట్స్ డే దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమలోని పలు పాఠశాలల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు ఫౌండేషన్ స్కూలులో అవ్వా తాతలతో తమ బాల్య స్మృతులను పిల్లలకు చెప్పించారు. అల్లు శ్రీను ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్స్, అష్టా చెమ్మా, క్యారమ్స్ పోటీలు నిర్వహించి గెలిచిన సీహెచ్ లక్ష్మి, నాగమ్మ, పాండ్రంకి లక్ష్మి, దువ్వారపు దుర్గమ్మ, పాండ్రంకి కొండలరావులకు బహుమతులు అందించారు. పెదపాడు హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబ పెద్దలను అందరూ గౌరవించాలని, వారు ఆరోగ్యంగానే ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అవ్వా తాతలకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలను సన్మానించారు. బుట్టాయగూడెం విద్యారోహిణి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం పేరెంట్స్ డే ను ఘనంగా నిర్వహించారు.

నేడు బీచ్ సందర్శనకు అనుమతి లేదు

మొగల్తూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం పేరుపాలెం బీచ్‌కు సందర్శకుల అనుమతి లేదని తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్ తెలిపారు. అలలు ఉవ్వెత్తున ఎగసిపడే అవకాశం ఉండడంతో బీచ్‌కు సందర్శకులను అనుమతించమన్నారు.

తాడేపల్లిగూడెం డీఎల్‌డీవోగా ప్రభాకర్ బాధ్యతలు



తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం డివిజన్ లెవిల్ డెవలప్‌మెంట్ (డీఎల్‌డీవో) అధికారిగా ఎం.ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకూ డ్వామా పీడీగా పనిచేసి డీఎల్‌డీవోగా బదిలీపై తాడేపల్లిగూడెం వచ్చారు. 2014లో తాడేపల్లిగూడెం ఎంపీడీవోగా పనిచేసిన అనుభవం ఉంది.



గ్రామాలలో శాంతి భద్రతలు పర్యవేక్షించాలి : డీఎస్పీ

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో శాంతి భద్రతలు, ప్రజా సమస్యలు పర్యవేక్షించాల్సిన బాధ్యత గ్రామ మహిళా పోలీసులు తీసుకోవాలని తాడేపల్లిగూడెం డీఎస్పీ డీ.విశ్వనాద్ సూచించారు. తాడేపల్లిగూడెం లోని మాగంటి కల్యాణ మండపంలో శనివారం తాడేపల్లి గూడెం పట్టణం, రూరల్, పెంటపాడు మండ లాల్లో మహిళా పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ జేవీఎస్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి ఉండి కేవీకేలో సర్టిఫికెట్ కోర్సు

ఉండి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించడం జరుగుతుందని కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లి కార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై ఈ కోర్సు నిర్వహిస్తున్నట్టు, అందుబాటులో ఉన్న 30 ప్రతినిధులను మొదటి విడతలో ఎంపిక చేసుకుని కోర్సు అందిస్తామని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల 4వరకు ఈకోర్సు కొనసాగు తుందన్నారు. దీనిని గోదావరి మండల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు విచ్చేసి ప్రారంభిస్తారని, సహకార సంఘాల అధిపతి, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. నేలలు, నేలపోషక యాజమాన్యం, రసాయన, సేంద్రియ ఎరువులు వినియోగం, ఫర్టిలైజరు కంట్రోల్ యాక్ట్, సమస్యాత్మక నేలలు యాజ మాన్యం, ఎరువులలో కల్తీ గుర్తించడంలో నిపుణులతో శిక్షణ తరగతులు ఇస్తామన్నారు.

వినాయకుడి కిరీటం స్వాధీనం

తణుకు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):తణుకు మండలం వేల్పూరులోని వినాయకుడి గుడిలో చోరీ అయిన 500 గ్రాముల వెండి కిరీటం స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ ఏబీజీ మూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు నిందితుడు మల్కిపురం గ్రామానికి చెందిన అల్లం దేవిని వేల్పూరు సంత మార్కెట్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు.

15 ఏళ్లుగా ఆ పల్లెకు రాని వెలుగు



భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 19: టెక్నాలజీ లోకంలో ఉన్నాం.. ఆన్‌లైన్ బుకింగ్.. అన్నీ ఇంటి దగ్గరకు వచ్చేస్తున్నాయి.. ఇలాంటి రోజుల్లో భీమవరం మండలంలోని వెంప గ్రామానికి ఆర్టీసీ బస్ సౌకర్యం కరువైంది. నిన్న మొన్నటి నుంచి కాదు. ఆ గ్రామానికి ఆర్టీసీ బస్సు వెళ్ళి ఒకటిన్నర దశాబ్దాలు దాటుతోంది. ప్రైవేటు బస్సులు లేవు. ఆటో వస్తేనే ప్రయాణం సాగేది. ఒక్కరికి 13 కి.మీ. ప్రయాణం చార్జీ రూ.50 చెల్లించాల్సిందే. ఏ సమయంలో ఆటోలు ఉంటాయో తెలియదు. ప్రయాణం సమస్యతో పాటు ధరాభారంతో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్టీసీ.. 4 ప్రైవేటు బస్సులు

వెంప గ్రామానికి చివరి పాయింట్‌గా ఆర్టీసీ బస్సులతో పాటు నాలుగు ప్రైవేటు బస్సులు ఉండేవి. ప్రతి అరగంటకు ఒక బస్సు అందుబాటులో ఉండేది. దీంతో విద్యా ర్థులు కళాశాలలకు వెళ్ళేందుకు అనువుగా ఉండేది. ఆర్టీసీ బస్సు మొగల్తూరు వయా వెంప మీదుగా భీమవరం పట్టణానికి వచ్చేది. దీని వలన మొగల్తూరు విద్యార్థులు, ప్రజలు భీమవరం వచ్చి వెళ్ళేవారు.

డబుల్ రోడ్డుగా మార్చినా..

వెంప గ్రామానికి వెళ్ళే రహదారి 5 కి.మీ. పొడువున 6 ఏళ్ళ క్రితం సుమారు రూ.6 కోట్లతో సింగల్ రోడ్‌ను డబుల్ రోడ్‌గా అభివృద్ధి చేశారు. అయినప్పటికి ఆర్టీసీ గ్రామం వైపు చూడలేదు. గతంలో 6 బస్సులు ఉండే గ్రామానికి ఒక్క బస్ కూడా ఏర్పాటు చేయకపోవడం విడ్డూరం. వెంప గ్రామం భీమవరానికి 13 కి.మీ. దూరం. భీమవరం నుంచి వెంపకు మూడు గ్రామాలు దాటి వెళ్ళాలి. అందువలన బస్ ఏర్పాటు లాభదాయకమేనని పలువురు చెబుతున్నారు.

వ్యయ ప్రయాసలకు గురవుతున్న ప్రయాణికులు

వెంప గ్రామానికి డబుల్ రోడ్డు వేసినా తప్పని పాట్లు



గ్రామంలోని డబుల్ రోడ్డు



ఆడియో ఫంక్షన్‌లో చిత్ర బృందం

ఎంత పనిచేసావ్ చంటి !

నరసాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నరసాపురం వైఎన్ కాలేజీలో శనివారం రాత్రి 'ఎంతపని చేసావ్ చంటి' సినిమా ఆడియో పంక్షన్ జరిగింది. ఉదయ్‌కిరణ్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో ఉలిశెట్టి శ్రీనివాస్ హీరోగా నటించారు. ఆయన స్వస్థలం నరసాపురం మండలం వేములదీవి కావడంతో ఆడియోపంక్షన్‌ను కాలేజీలో నిర్వహించడం గమనార్హం. ఇక ఈ చిత్రంలో హీరోయిన్లుగా నిహారిక కేశవ్, శాంతిప్రియ, ప్రజ్ఞా గౌతమ్ నటించారు. ఆడియో పంక్షన్‌లో జబర్దస్ నవీన్, అప్పారావు, వినయ్ కామెడీ షో ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచింది. ఈ ఆడియో పంక్షన్‌లో విద్యార్థులతో పాటు పట్టణ ప్రముఖు లు పాల్గొని చిత్ర బృందానికి ఆల్‌ది బెస్ట్ చెప్పారు.

ప్రతిభ ఉన్న కళాకారులకు ఎన్నో అవకాశాలు



గతంలో సినిమాలు, సీరియల్స్‌లో అవకాశాల కోసం స్టూడియో, దర్శకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది, నేడు ఈ పరిస్థితి లేదు, సోషల్ మీడియా వచ్చిన తరువాత అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. సోషల్ మీడియాలో కొందరు కళాకారులు చేసిపెడుతున్న రీల్స్, షార్ట్ వీడియోలు చూసి పిలిచి అవకాశాలు ఇస్తున్నారు. ఇప్పటి వరకు 150 చిత్రాల వరకు చిన్న చిన్న పాత్రలు వేసా, కానీ నాకు కామిడీ షోలోనే గుర్తింపు వచ్చింది

- గెడ్డం నవీన్, జబర్దస్త్ ఫేమ్

హాస్య కళాకారులకు బుల్లి తెరలో మంచి అవకాశాలు



నేడు బుల్లితెర వచ్చిన తరువాత హాస్యకళాకారులకే మంచి అవకాశాలు వస్తున్నాయి. జబర్దస్, శ్రీదేవి డ్రామా కంపెనీ వంటి ప్రోగ్రాంలు వచ్చిన తరువాత నాలాంటి ఎంతోమంది కళాకారులు వెలుగులోకి వచ్చి గుర్తింపు పొందారు. సినిమాలు, వెబ్ సీరిస్, టీవీ సీరియల్స్ సంఖ్య కూడా రోజు రోజుకు పెరిగిపోతుంది. ప్రస్తుతం సినీ రంగంలో వస్తున్న హాస్యం కంటే బుల్లితెరలో వస్తున్న హాస్యానికే ఎక్కువ ఆదరణ లభిస్తుంది. ఎందుకంటే రీల్స్, షార్ట్ వీడియోలు వాట్సాప్‌లో చూసే సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. దీనివల్ల ప్రతిభ ఉన్న కళాకారులంతా ఈ రంగంలో స్థానం దక్కించుకుంటున్నారు. ఇప్పటి వరకు 200 ప్రోగ్రామ్‌లు ఇచ్చాం.

- అప్పారావు, జబర్దస్త్ ఫేమ్



టెక్రియా ముగింపు కార్యక్రమంలో అచార్యులు

ముగిసిన టెక్రియా 2కే24



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 19 : గత మూడు రోజులుగా ఏపీ నిట్‌లో రిజిస్ట్రార్ డాక్టర్ పి. దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వ హిస్తున్న టెక్రియా 2కే24 కార్యక్రమం శనివారం తో ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పలువురు వక్తలు ప్రసగించారు. డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్, డాక్టర్ తలారి రేష్మ తదితరులు పాల్గొన్నారు.

సహజ వాయువు పైప్‌లైన్ పనులపై వినతి

ఏలూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ - శ్రీకాకుళం మధ్య సహజవాయువు పైప్‌లైన్ ప్రాజెక్టు పనుల బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తిచేయాలని గెయిల్ మార్కెటింగ్ డైరెక్టర్ సంజయ్ కుమార్‌ను ఏలూరు ఎంపీ పుట్టామహేష్‌కుమార్ ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. పైప్‌లైన్ ఏర్పాటు పనుల్లో జాప్యాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. కాకినాడ - శ్రీకాకుళం పైప్‌లైన్ ప్రాజెక్టు పనుల్లో గెయిల్‌కు పూర్వ అనుభవం ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం ఆ ప్రాజెక్టు పనులు బాధ్యత తీసుకోవాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన గెయిల్ మార్కెటింగ్ డైరెక్టర్ సంజయ్‌కుమార్ ఇంధనం, సహజ వాయువు రెగ్యులేటరీ బోర్డుతో సంప్రదింపులు జరిపి త్వరలో నిర్ణయం వెల్లడిస్తామని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.



గెయిల్ మార్కెటింగ్ డైరెక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా

స్పోర్ట్స్ కాలమ్

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపిక



పాలకొల్లు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు జరిగిన లాంగ్ టెన్నిస్ అండర్-14, 17 విభాగంలో బాలబాలికలకు జిల్లా స్థాయి ఎంపికలు స్థానిక టౌన్ హాల్లో శనివారం జరిగాయి. బాలురు విభాగం అండర్-14లో వి. భువన్ ధీరజ్, ఐ. దుర్గశ్రీ అఖిల్, సీహెచ్ సాయి సహర్ష్, బి. దీపేంద్ర మారుతి, టి రిషిక్, బాలికల విభాగంలో ఎన్. లేఖ్యశ్రీ, జి. స్పార్కిల్ ఏంజెల్ ఉన్నారు. ఈ నెల 28 నుంచి కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని జిల్లా కార్యదర్శి మల్లేశ్వరరావు తెలిపారు. టౌన్ హాల్ కార్యదర్శి ఎం. ఆదినారాయణ, అరవింద్, మోహన్ కళ్యాణ్ కుమార్, ఎన్ శ్రీనివాస్, దినేష్, కోచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బట్టు గ్లోరి ఎంపిక



ఉంగుటూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తణుకులో జరిగిన అండర్-17 షటిల్ పోటీలలో నారాయణపురం హైస్కూలు విద్యార్థిని బట్టు గ్లోరి విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం షేక్ మీరా సాహెబ్ తెలిపారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బేతాళ రాణి తర్ఫీదు ఇచ్చారు.



సిద్ధాంతం రేవులో పూజలు చేస్తున్న మహిళలు

అట్లతద్దోయ్ ఆరట్లోయ్..

ఉమ్మడి పశ్చిమలో ఘనంగా అట్ల తద్దె.. గౌరీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు

ఆకివీడు/పెనుగొండ/ ఆచంట/ దెందులూరు/ పాలకొల్లు అర్బన్/పోలవరం/గణపవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ బహుళ తదియ శనివారం అట్ల తద్దిని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మహిళలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తెల్లవారుజామునే లేచి స్నానాదికాలు పూర్తి చేసుకుని మంగళగౌరీ దేవికి పూజలు చేశారు. కొత్తగా పెళ్లయిన యువతులు మంగళ గౌరీ నోము నోచుకున్నారు. నోము పట్టిన వారు 11 మంది ముత్తైదువలకు ఒక్కొక్కరికి 11 అట్లు వాయనంతోపాటు చీర, సారె, పండ్లు ఇచ్చి నోము పూర్తి చేశారు. చిన్నా పెద్దా ఊయలలూగారు. అట్లతద్దోయ్.. ఆరట్లోయ్, ముద్దపప్పోయ్.. మూడట్లోయ్ అంటూ పాటలు పాడారు. గో ప్రదక్షిణలు చేసి గో మాతకు పూజలు చేశారు. చీకటి పడిన తరువాత చంద్రదర్శనం చేసుకొని స్నానమాచరించి గౌరీదేవికి పూజ చేశారు. ముత్తయిదువులకు వాయనాలు ఇచ్చారు. ఆకివీడు భుజబలరాయుడు చెరువు వద్ద ముత్తయిదువలు పూజలు చేశారు. అమ్మవార్ల ఆలయాలు కిటకిటలాడాయి. పెనుగొండ, సిద్ధాంతం, ములపర్రు, వడలి, ఇలపర్రు, నడిపూడి గ్రామాల్లో కాలువ రేవుల వద్ద అట్ల తద్దిని ఘనంగా నిర్వహించారు. దెందులూరు విజయనగేష్ బీఆర్ అండ్ డీఈడీ-నర్సింగ్ కాలేజీలో కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. నర్సింగ్ విద్యార్థులు చెట్లకు ఊయలలు ఏర్పాటు చేసుకుని ఊగారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా లక్ష్మీ, గౌరి దేవిలకు పూజలు చేశారు. పోలవరంలో ఉదయానే గోదావరి నదీ స్నానాలు చేసి ఉపవాస వ్రతాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



గణపవరంలో గోపూజ..



ఆకివీడులో వాయనాలు ఇస్తున్న దృశ్యం



మైదానం కాదిది.. మడుగు

ద్వారకాతిరుమల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆహా...ఎంత చక్కగా ఉంది ఈ మైదానం..... ఆడుకుంటే అద్భుతంగా ఉంటుంది కదూ అని భ్రమ పడ్డారో ..పీకల్లోతు నీటిలో కాలు వేసినట్లే.. మైదానం కాదండీ ఇది... శ్రీవారి సుదర్శన పుష్కరిణి... ప్రతీ ఏటా తామరతూడు, ఆకులు పూలుతో నిండి ఉండే ఈ పుష్కరిణిని శ్రీవారి దేవస్థానం తెప్పోత్సవం నిమిత్తం బాగు చేస్తున్నారు. అయితే ఎంత తూడు, వ్యర్థాలు బయటకు తీసినా అది ఇంకా తామరాకులు, పూలతో నిండి ఉండి పచ్చని పచ్చిక బయిలును తలపిస్తూ చూపరులకు కనువిందు చేస్తోంది.

బీ-ఫార్మసీ సీట్లు పెరిగాయ్



- జిల్లాలో రెండు కొత్త కాలేజీలు
- 280 సీట్లు అదనం
- 2024 విద్యా సంవత్సరంలో జిల్లాలో 11 ఫార్మసీ 60 సీట్లు ఈడబ్ల్యూఎస్ కింద మరో 112 సీట్లు మొత్తం 1,232 సీట్లు

భీమవరం ఎడ్యుకేషన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ కళాశాలల్లో బీ-ఫార్మసీ కోర్సుకు ఈఏడాది నుంచి సీట్లు మరికొన్ని అందుబాటులోకి వచ్చాయి. ఈ కోర్సు చేయాలనుకునే విద్యార్థులకు సీట్ల పెంపు అవకాశంగా మారనుంది. ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా ఫార్మసీ కళాశాలలు గత ఏడాది వరకు తొమ్మిది ఉన్నాయి. 2024 విద్యా సంవత్సరానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి నుంచి రెండు కొత్త కళాశాలలకు అనుమతి వచ్చింది. ఈ సంవత్సరం నుంచి 11 ఫార్మసీ కాలేజీలు అవనున్నాయి. సీట్ల సంఖ్య కూడా బాగా పెరిగింది. కొత్త కాలేజీలు ఏలూరు జిల్లా ముదినేపల్లి విజయ ఫార్మసీ కళాశాలలో 100 సీట్లు, కొయ్యలగూడెంలో ప్రకాశం ఫార్మసీ కళాశాలలో 100 సీట్లు మొత్తం 200 సీట్లు వచ్చాయి. గత ఏడాది వరకు సీఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో 60 సీట్లు ఉండగా 100 సీట్లు అయ్యాయి. జగయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫార్మసీ కళాశాలలో 60 సీట్లు 100 సీట్లుగా అయ్యాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది 280 సీట్లు బీ.ఫార్మసీ కోర్సులో పెరిగాయి. బీ-ఫార్మసీ కోర్సులో కన్వీనర్ కోటా సీట్లు 742, మేనేజ్‌మెంట్ సీట్లు 318గా మారాయి. మొత్తం 1,060 సీట్లు అయ్యాయి. డీ-ఫార్మసీ కోర్సులలో 60 సీట్లు ఉండగా బీ-ఫార్మసీ, డీ-ఫార్మసీ కోర్సులలో 10 శాతం అదనంగా ఈడబ్ల్యూఎస్ కింద 112 సీట్లలో విద్యార్థులు చేరవచ్చు. అన్నివిధాలుగా 1,232 సీట్లు బీ-ఫార్మసీ, డీ-ఫార్మసీ కోర్సులలో విద్యార్థులు ఈ ఏడాది నుంచి చేరే అవకాశం ఉంది.

ఫార్మసీ కోర్సులపై ఆసక్తి ఎక్కువ

ఫార్మసీ కోర్సులపై విద్యార్థుల ఆసక్తి కనబరుస్తూ వస్తున్నారు. అందువల్ల ఫార్మసీ కళాశాలలో సీట్ల భర్తీ ప్రతీ ఏడాది పూర్తిస్థాయిలో అవుతున్నాయి. ఆ లెక్కనే రెండు నూతన కళాశాలలు రావడానికి కారణమైంది. కౌన్సెలింగ్ ఆలస్యమైన విద్యార్థులు ఇతర కోర్సులకు వెళ్ళకుండా వారికి నచ్చిన ఫార్మసీ కోర్సులలోనే చదువుతున్నారు. గత ఏడాది కౌన్సెలింగ్ సంవత్సరం చివరి నెలలోనే జరిగింది. 2024 విద్యా సంవత్సరం కౌన్సెలింగ్ నవంబరు నెలలో జరిగే అవకాశం ఉంది. పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతున్నాయి.

ఉపాధి అవకాశాలు మెండు

ఫార్మసీ కోర్సులు చేసిన వారికి ఉపాధి అవకాశాలు బాగుంటున్నాయి. అందుకే కోర్సు చేయడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఇంజనీరింగ్‌లో ఒక సాఫ్ట్‌వేర్ రంగంతో సరిపెట్టుకోకుండా ఫార్మసీలో ఎక్కువ రంగాలలోకి వెళ్లే అవకాశాలు ఉంటున్నాయి. ఇండస్ట్రీ, అకడమిక్స్ డ్రగ్ ఇన్స్పెక్టర్ ఫార్మసిస్ట్, రిసర్చ్ అన్ డెవలప్‌మెంట్‌లతో పాటు సాఫ్ట్ రంగంలోకి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు వెళుతున్నారు. ఫార్మసీ కోర్సులకు క్రేజ్ పెరిగింది. ఎంపీసీ చదివిన విద్యార్థులకు ఫార్మసీ కోర్సు చేసే అవకాశం ఉన్నందున వారు చేరుతున్నారు.

జూదంపై ఉక్కుపాదం

- గంజాయి, సైబర్ నేరాలు, గల్ఫ్ మోసాలపై ప్రత్యేక దృష్టి
- ఉమ్మడి జిల్లాల్లో పెరిగిన క్రైమ్ రేటు
- ఏజెన్సీలో నక్సల్స్, సానుభూతి పరులపై నిఘా : ఐజీపీ అశోక్



విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీపీ అశోక్ కుమార్.. చిత్రంలో ఎస్పీ నయీం అస్మి

నరసాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పేకాట క్లబ్‌లకు అనుమతించేది లేదని, ఎక్కడైనా అనధికారికంగా నిర్వహిస్తుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు ఏలూరు రేంజ్ ఐజీపీ అశోక్‌కుమార్ చెప్పారు. శనివారం నరసాపురం డీఎస్పీ, రూరల్ పోలీస్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డివిజన్‌లో ఎస్సైలు, సీఐలతో శాంతి భద్రతలపై సమీక్షలు నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల చత్తీస్‌ఘడ్‌లో ఎన్‌కౌంటర్ జరిగిన తరువాత జిల్లాలో నక్సల్ కదలికలపై నిఘా ఉంచామన్నారు. అయితే ఏలూరు ఏజెన్సీ ప్రాంతంలో చత్తీస్‌ఘడ్ నుంచి కొంతమంది సానుభూతి పరులు తలదాచుకుంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల ఆ రాష్ట్ర పోలీసులు ఈ ప్రాంతాల్లో కొంతమంది సానుభూతిపరుల్ని అరెస్టు చేసి తీసుకెళ్లారన్నారు. రెండు జిల్లాల్లో గత ఏడాదికంటే ఈసారి క్రైమ్ రేట్ పెరిగిందన్నారు. దీన్ని నియంత్రించేందుకు పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించామన్నారు. సైబర్ నేరాలు, గల్ఫ్ మోసాలపైన నిఘా పెట్టామన్నారు. గంజాయి విక్రయాలను పూర్తిగా నియంత్రించాలన్న లక్ష్యంతో రవాణ, విక్రయదారుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి సింగిల్ హైవే రహదార్లపై తరుచూ యాక్సిడెంట్‌లు జరిగే ప్రదేశాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు ఐజీపీ చెప్పారు. సమావేశంలో ఎస్పీ నయీం అస్మి, అదనపు ఎస్పీలు మురళీకృష్ణ, భీమారావ్, సీఐ యాదగిరి, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి పాల్గొన్నారు.


పదోన్నతుల్లో ఎవరికీ అన్యాయం జరగదు : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) ఖాళీల భర్తీకి ఏలూరు జిల్లాలోని సచివాలయాల్లో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నవారిలో అర్హులైనవారికి పదోన్నతులు ఇచ్చేందుకు 1087 మంది ఏఎన్ఎంలతో కూడిన ప్రాథమిక జాబితాను విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తెలిపారు. పదోన్నతుల ప్రక్రియ వివాదాస్పదం కావడంపై శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె వివరణ ఇచ్చారు. జిల్లాలో పదోన్నతులపై భర్తీచేయ తలపెట్టిన ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్) వెకెన్సీల సంఖ్యపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయాన్ని వెలువరించలేదన్నారు. సచివాలయ ఏఎన్ఎంల రిక్రూట్‌మెంట్ 2017లో జరిగిందని వివరించారు. ప్రస్తుతం విడుదల చేసిన తాత్కాలిక సీనియార్టీ జాబితాపై ఇంతవరకు అందిన 200 అభ్యంతరాలను వారం రోజుల వ్యవధిలో పరిష్కరించి ప్రొవిజినల్ జాబితాను విడుదల చేస్తామని, ఆ జాబితాపైనా అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించిన తర్వాతే తుది సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామన్నారు. ఈ నేపథ్యంలో డబ్బులు చెల్లించిన వారిని సీనియార్టీ జాబితాలో తొలివరుసలో చేరుస్తున్నారని, ఇవ్వనివారిని జాబితానుంచి తొలగిస్తున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వివరించారు. పదోన్నతుల నిమిత్తం లేదా ఏదైనా పనుల నిమిత్తం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎవరికైనా డబ్బులు ఇస్తే వారు నష్టపోవడమే కాక లంచం ఇచ్చిన వారిపై, పుచ్చుకున్నవారిపై పోలీసు కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.



పోలీస్ స్టేషన్ ఎదుట జనసేన నాయకుల ధర్నా

గణపవరం, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 19: ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుపై సోషల్ మీడియాలో అసత్య, నిరాధారమైన ఆరోపణలు రావడాన్ని నిరసిస్తూ గణపవరం పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం మండల జనసేన నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. దీనికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు తోట శ్రీనివాసరావు, కొలనువాడ శ్రీనివాసరాజు, గంగుమోలు చినరత్తయ్య, చప్పా రాంబాబు, తోట పవన్, తదితరులు ఎస్సై మణికుమార్‌కు ఫిర్యాదు చేశారు.



న్యాయమూర్తుల శ్రమదానం

ఏలూరు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని దీని వల్ల మానసిక ప్రశాంతత పొందవచ్చునని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో న్యాయ మూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి శనివారం శ్రమదానం చేశారు. ఆవర ణలో పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించారు. న్యాయమూర్తులు పలుగు, పారలు పట్టుకుని పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. జడ్జి పురుషోత్తమకుమార్ మాట్లాడుతూ ఎన్నో బాధలతో న్యాయం కోసం కోర్టుకు వస్తారని అలాంటి వారికి చక్కని వాతావరణం కల్పించి వారికి మనోవేదన పరిసరాల పరిశుభ్రతతో కొంత తగ్గించగలుగుతామన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తితోపాటు రెండో అదనపు జిల్లా జడ్జి పి. మంగాకుమారి, 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ పాల్గొన్నారు.



డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్

ఉంగుటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. శనివారం చేబ్రోలులో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి సమాచారం రాబట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, సభ్యత్వ జిల్లా ప్రముఖ్ శరణాల మాలతీరాణి మాట్లాడుతూ మోదీ సర్కారు ద్వారా రాష్ట్రాభివృద్ధి జరుగుతున్నదన్నారు. చేబ్రోలు సర్పంచ్ రాంధే లక్ష్మీసునీత, ఎంపీటీసీలు, పార్లమెంటు కన్వీనర్ కట్నేని కృష్ణప్రసాద్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. తొలుత దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. నియోజకవర్గానికి వచ్చిన సిద్ధార్థనాథ్ సింగ్‌ను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలిసి అభినందించారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

ఏలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. శనివారం ఏలూరులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన క్రియాశీల సభ్యత్వ జిల్లా కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు 82 వేల సభ్యత్వాలు పూర్తయ్యాయన్నారు. ఈ నెలాఖరుకు లక్షకుపైనే సభ్యత్వాలు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ్యత్వ రాష్ట్ర ప్రముఖ్ గారపాటి సీతారామాంజనేయచౌదరి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో ఏలూరు జిల్లా ప్రముఖ స్థానంలో ఉండేలా కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాల్లో తాను పర్యటించి సభ్యత్వ నమోదుకు కృషి చేస్తానన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్ర ప్రకాష్, మట్టా ప్రసాద్, శరణాల మాలతీరాణి, కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.



జిన్నూరులో సీసీ రోడ్డు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రామానాయుడు

ఎన్డీయేతోనే గ్రామ స్వరాజ్యం

- మంత్రి రామానాయుడు

పోడూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బాపూజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం జిన్నూరు, మట్టపర్రు గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా రూ.45 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ పట్టణాలకు దీటుగా పల్లెసీమలను అభివృద్ధి చేసి గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామన్నారు. పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ.4500 కోట్లతో 30 వేల పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధిని భ్రష్టు పట్టించాయని విమర్శించారు. గ్రామాల్లో తాగునీటికి, రహదారులకు, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిచ్చి పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. జిన్నూరు చాకిరేవుగుంట వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సర్పంచ్‌లు జమ్ము బేబీ మహాలక్ష్మి, దొమ్మేటి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు భూపతిరాజు సరస్వతి, విప్పర్తి శారద, మానేపల్లి శ్రీధర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు భూపతిరాజు ప్రసాదరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, దాసరి రత్నరాజు, పొలవలస తులసీరావు, దేవళ్ల శ్రీరామకోటి మోహన్, కుక్కల సత్యనారాయణ, గుబ్బల శ్రీరామ్, మేడిశెట్టి బుజ్జి, శీలం శ్రీనివాసరావు, కడలి ఆంజనేయులు, నూటికుర్తి శ్యాంబాబు, దేవరపు దొరబాబు, కేతా హరివెంకటకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు పితాని వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

రెండు మాధ్యమాలతోనే పరిష్కారం

- జీవో 117 ఉత్తర్వుల రద్దు లేదా మార్పు ఫలితంపై ప్రాథమిక అంచనా

ఏలూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులను ఏళ్ళ తరబడి వేధిస్తోన్న జీవో 117 ఉత్తర్వుల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చేలా మార్పులు తేనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మార్పుచేర్పులపై విద్యాశాఖ ప్రాథమికంగా ఓ అంచనాకు వచ్చింది. 2022లో అమల్లోకి వచ్చిన జీవో 117 ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లాలోని 222 ప్రాథమిక పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను ఒక కిలోమీటరు పరిధిలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించిన విషయం విదితమే. దీనివల్ల 3600 మంది బాలబాలికలు పాఠశాలల నుంచి ఇతర పాఠశాలలకు వెళ్లాల్సి వచ్చింది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఇతర పాఠశాలల్లోకి విలీనమైన 3, 4, 5 తరగతులను మళ్ళీ వెనక్కిపంపించి, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాలలుగా పూర్వపుస్థితికి చేర్చాల్సి ఉంటుంది. కాగా జీవో 117 ఉత్తర్వుల మేరకు ఇతర పాఠశాలల్లోకి విలీనమైన ప్రాథమిక తరగతులకు బోధించేందుకు స్కూల్ అసిస్టెంటను అప్పట్లోనే నియమించారు. ఇలా నియమితులైన స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్ల భవితవ్యం ఇకపై డైలమాలో పడే అవకాశం ఉంది. ఈ విధంగా ఉమ్మడి జిల్లాలో 600 మంది స్కూల్ అసిస్టెంట్లను ఏ విధంగా సర్దుబాటుచేస్తారో తేలాల్సి ఉంది. దీనికి పరిష్కారంగా ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నట్టు హైస్కూళ్లలో ఇపుడున్న ఇంగ్లీషు మాధ్యమానికి అదనంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెడితేనే సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ల సమస్య తలెత్తదని బావిస్తున్నారు. ఇక జీవో 117 ఉత్తర్వులను రద్దుచేస్తే హైస్కూళ్ళలో ప్రస్తుతం ఒక్కో టీచరు బోధిస్తున్న పీరియడ్ల సంఖ్య రోజుకి 7నుంచి 5 లేదా 6కి తగ్గిపోతాయని ఓ అంచనాకు వచ్చారు. కాగా జీవో 117 ఉత్తర్వుల రద్దు లేదా మార్పులపై ప్రభుత్వంనుంచి ఇంత వరకు అధికారిక ఉత్తర్వులు లేవు.

ప్రశాంతంగా 'టెట్'

భీమవరం ఎడ్యుకేషన్/ఏలూరు అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్ - 2024 పరీక్ష ఐదోరోజు శనివారం భీమవరం డీఎన్నార్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రశాంతంగా జరిగిందని పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో జి.నాగమణి తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో 180 మంది అభ్యర్థులకు 158 మంది హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారు. హాజరుశాతం 87.8 శాతంగా నమోదైంది. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ పరీక్షలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని డీఈవో పేర్కొన్నారు.

ఏలూరు జిల్లాలో శనివారం జరిగిన 'టెట్' పరీక్షకు 185 మంది అభ్యర్థులకు 165 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం తెలిపారు.

ఏలూరు టు చెన్నై

అనాథ మృతదేహాల తరలింపు !

- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితోపాటు మిగిలిన వారి పాత్రపై విచారణ
- మహిళా మృతదేహాలను పురుషులతో పోస్టుమార్టం
- మృతదేహాల నమోదుకే పరిమితమైన అసిస్టెంట్లు

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీ నుంచి మృతదేహం అపహరణపై వచ్చిన కథనం శనివారం తీవ్ర కలకలం రేగింది. మెడికల్ కాలేజీ, ఆసుపత్రి అధికారులు దర్యాప్తు చర్యలు చేపట్టారు. ఈ నెల 8వ తేదీ రాత్రి మార్చురీ అసిస్టెంట్ అశోక్ మార్చురీ తాళాలు డ్యూటీలో ఉన్న మరో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నుంచి తీసుకుని ఒక అంబులెన్సు ద్వారా మృతదేహాన్ని తరలించారు. అనుమానం కల్గిన మహిళా ఉద్యోగిని అశోక్‌ను నిలదీసి అధికారులకు సమాచారం ఇవ్వడంతో కొంతసేపటికే మృతదేహాన్ని తిరిగి మార్చురీలో పెట్టేశారు. ఈ ఘటనపై ఆ మహిళా ఉద్యోగిని ఫిర్యాదు మేరకు ఫోరెన్సిక్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కె.భాస్కర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శశిధర్‌కు ఈ నెల 18న ఫిర్యాదు చేశారు. తీగలాగితే డొంక కదిలినట్లు మార్చురీ కథ మొదలైంది.

వైద్య విధాన పరిషత్ ఆధీనంలో ఉన్న ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రి మెడికల్ కళాశాల ఆధీనంలోకి వెళ్లిన తర్వాత ఆసుపత్రిలో ఎంత మంది మరణించారు. ఎన్ని మృతదేహాలు మార్చురీలో ఉంచారు. వాటిలో అనాథ మృతదేహాలు ఎన్ని అనే లెక్కలు తీసుకున్నారు. కొన్ని మృతదేహాలు హైదరాబాద్, చెన్నై, నంది గామ వంటి ప్రాంతాలకు తరలించారని తెలుస్తోంది. ఒక వైద్యుడు ఇతర ప్రాంతాల నుంచి అంబులెన్సులు తీసుకువచ్చి మృతదేహాలను పంపించేవారని సమాచారం. వాస్తవానికి అనాథ మృతదేహాలను ఆసుపత్రి అధికారులు, ఖననం నిమిత్తం మున్సిపాల్టీకి అప్పగిస్తారు. సిబ్బంది వచ్చి వీటిని స్మశానానికి తరలించి రికార్డుల్లో నమోదు చేయించి ఖననం చేస్తారు. మార్చురీ నుంచి మున్సిపాల్టీకి అప్పగించే క్రమంలో వాటిని ఫోటో తీసి భద్రపర్చాలి. కాని, ఇంత వరకూ ఒక్క ఫోటో కూడా తీయలేదు. గతంలో మార్చురీ వద్ద సీసీ కెమెరాలు ఉండగా మెడికల్ కాలేజీగా మారిన తర్వాత తొలగించారు. మృతదేహం తస్కరించే యత్నంతో ఖంగుతిన్న అధికారులు చర్యలు చేపట్టారు. మార్చురీ వద్ద సెక్యూరిటీ గార్డును నియమించారు. ఎన్ని మృతదేహాలు లోపలికి వస్తున్నాయ్, ఎన్ని బయటకు వెళుతున్నాయి వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. చెన్నైలోని ఒక మెడికల్ కళాశాలకు ఈ నెల 8న మృతదేహాన్ని తరలించే ప్రయత్నం చేసి నట్లు సమాచారం. మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ విభాగం హెచ్‌వోడీ కె.భాస్కర్‌ను వివరణ కోరగా తాము ప్రస్తుతం మృతదేహాల లెక్కలు చూస్తున్నామని, రికార్డులన్ని పరిశీలించి ఒకటి రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో వివరాలు తెలియజేస్తామన్నారు.

ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం వచ్చే మహిళల మృతదేహాలను కోయడానికి నలుగురు మహిళా సిబ్బందిని నియమించారు. వారు ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఒక్క మహిళా మృతదేహానికి పీఎం చేయించలేదు. కేవలం ఇద్దరు వ్యక్తులతోనే అన్నింటికి పోస్టుమార్టం జరిపించారు. ఈ నలుగురిని వచ్చిన మృతదేహాలను నమోదు చేయించడానికే పరిమితం చేశారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రసవ వేదనతో గర్భిణి విలవిల

తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో పట్టించుకోని వైద్యులు..

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 19 : తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది అలసత్వం కారణంగా ఒక నిండు గర్భిణీ ఆసుపత్రి బెడ్ పైనే ప్రసవించిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకున్నది. తాడేపల్లిగూడెం మండలం ఎల్ అగ్రహారంకు చెందిన ఎర్రా శకుంతల గర్భిణీగా డెలివరి కోసం ఏరియా ఆసుపత్రిలో మూడు రోజుల క్రితం చేరింది. ఆసుపత్రి సిబ్బంది ఆమెను పట్టించుకోకుండా మహిళల వార్డులోనే వదిలేయడంతో శకుంతల తల్లి ధనలక్ష్మి పలుమార్లు వైద్యులను తన కుమార్తెకు ప్రసవవేదన పడుతోందని వైద్యం అందించాలని వేడుకుంది. శుక్రవారం రాత్రి శకుంతలకు ప్రసవ వేదన ఎక్కువ కావడంతో వైద్యుల కోసం ఎదురుచూశారు. అప్పటికే డ్యూటీలో ఉన్న సిబ్బంది నిర్లక్షంగా వ్యవహరించి రేపు ఉదయం చూద్దామంటూ చెప్పి దురుసుగా ప్రవర్తించారు. చేసేదిలేక శకుంతలను మహిళల వార్డుకు తీసుకువెళ్ళిపోయారు. రాత్రంతా ప్రసవ వేదనతో ఇబ్బంది పడ్డ శకుంతల ఉదయానికి మంచంపైనే ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని అక్కడ శిక్షణలో ఉన్న నర్సులు గమనించి శంకుతలను వైద్యుల వద్దకు తరలించారు. ఈ ఘటనపై బాధితులు ఆందోళన చేపట్టడంతో మీడియా రంగప్రవేశం చేసింది. దీంతో వైద్యులు అక్కడ సమస్య లేనట్లు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని శకుంతల తల్లి ధనలక్ష్మి, తండ్రి దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఈ ఘటనపై పరిశీలన కమిటీ వేశామని తెలిపారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురానికి చెందిన గోడవల్లి సింహాద్రి అప్పారావు(48) కొంత కాలంగా నడుం నొప్పి, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం తన నివాసం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

ఆవు పొడవడంతో.. మృతి

భీమవరం క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న వ్యక్తిని ఆవు పొడవడంతో గాయాలపాలై చికిత్స పొందుతూ ఒక వ్యక్తి మృతి చెందాడు. భీమవరం మండలం ఈలంపూడికి చెందిన రైతు కూలీ కర్నాట శ్రీను (48) ఈ నెల 17న భీమవరం వచ్చి రాత్రి ఇంటికి వెళుతున్నాడు. అన్నాకోడేరు శివాలయం సమీపానికి వెళ్లే సరికి అక్కడ వున్న ఆవు బెదిరిపోయి శ్రీనును పొడిచింది. గాయాలపాలైన అతన్ని స్థానికులు సహాయంతో చికిత్స నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : ఒక వృద్ధుడు ఏలూరు రైల్వే ప్లాట్ పామ్‌పై అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏలూరు దక్షిణపువీధికి చెందిన రాజనాల రాము (72) రిక్షా తొక్కుతూ జీవిస్తాడు. ఈ నెల 15న విజయవాడ వెళుతున్నానని చెప్పాడు. అతను ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో ఫ్లాట్‌పామ్‌పై శనివారం మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి.సైమన్ ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు.

పిడుగుపాటుకు వ్యక్తి, మేకలు మృతి

ఉంగుటూరు/కుక్కునూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):గోపాలపురం శివారు పందిరెడ్డిగూడెం నివాసి పొలంలో పశువులు కాస్తున్న కైలా ఏడుకొండలు(53) శనివారం మధ్యాహ్నం పిడుగు పడి మృతి చెందాడు.

కుక్కునూరు మండలం దాచారం గ్రామ శివారుల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు పడడంతో వరసా వీరాస్వామి అనే రైతుకు చెందిన తొమ్మిది మేకలు మృతి చెందాయి.

క్రైమ్ కార్నర్

పేకాడుతూ దొరికిన ముగ్గురు పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో పేకాడుతున్న ముగ్గురు పోలీసులు పట్టుపడ్డారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శనివారపుపేటలోని వై.జంక్షన్ వద్ద అప్పిరెడ్డి అపార్టుమెంటులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సీఐ ఎస్.కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రసాద్, సిబ్బందితో దాడి చేశారు. ఇందులో 11 మందిని అరెస్టు చేయగా వారి నుంచి రెండు లక్షల 37 వేల 500ః నగదును స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ రవికుమార్, భీమడోలు పోలీస్ కానిస్టేబుల్ ప్రకాష్, భీమవరం ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసరావులను అరెస్టు చేశారు. ఎఆర్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఒక ప్రజా ప్రతినిధి వద్ద గన్‌మేన్‌గా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాల్‌మనీ కేసులో మరో ముగ్గురి అరెస్టు



నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి ఆపై దౌర్జన్యంగా ఇళ్ళల్లోకి ప్రవేశించి వస్తువులు, మోటారు సైకిళ్ళు తీసుకుపోతున్న వడ్డీ వ్యాపారులలో మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. సత్రంపాడుకు చెందిన మేడపాటి సుధాకరరెడ్డి, అల్లాడ లావణ్య, తూర్పు గోదావరి జిల్లా అనపర్తికి చెందిన వీరమళ్ళ రాజేష్ కొంత మంది కలిసి ఏలూరు నగరంలో చిరు వ్యాపారులకు, ఉద్యోగులకు అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నారు. వాటిని చెల్లిస్తున్నప్పటికి దౌర్జన్యంగా ఇళ్ళల్లోకి ప్రవేశించి వస్తువులు, మోటారు సైకిళ్లు తీసుకుపోయి వేధిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఇప్పటికే ఏలూరు వన్‌టౌన్, రూరల్, టూటౌన్, త్రీ టౌన్ టి.నర్సాపురం, ముసునూరు పోలీస్ స్టేషన్లలో ఏడు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ఏలూరు సత్రంపాడుకు చెందిన గూడవల్లి విద్యాసాగర్, శనివారపుపేటకు చెందిన మహ్మద్ అఖిల్ రెహమాన్‌లను అరెస్టు చేశారు. కేసులో ప్రధాన నిందితుడైన సుధాకరరెడ్డి, లావణ్య, రాజేష్‌లను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు. సమావేశంలో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

పోలీసులు అకస్మాత్తుగా ఏలూరులో పలు ప్రాంతాలపై శనివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో టూ టౌన్, త్రీ టౌన్ సీఐలు వై.వెంకటరమణ, ఎస్.కోటేశ్వరరావు, నగర పోలీస్ సిబ్బంది కలిసి గన్‌బజార్, బంగారునాగన్న వీధి, కబడ్డీగూడెం, యానాదుల కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత గృహాల్లో నివసిస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఉచిత ఇసుకపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానంతో ప్రజలు, నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. పట్టణ టీడీపీ కార్యాయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుకను ఆయా స్థానికంగా ఉన్న కాలువల్లో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై ఉచితంగా తీసుకు వెళ్లవచ్చని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై ప్రజలు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కె.రమాదేవి, టి.జ్యోతి, టీడీపీ నాయకులు బి.రాజ్‌పాల్ కుమార్, పి.అంబేద్కర్ పాల్గొన్నారు.

పాలాభిషేకం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక అవసరాలకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై ఇసుకను ఉచితంగా తీసుకువెళ్లవచ్చని సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనపై సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలకు శనివారం బైపాస్ రోడ్డు వద్ద ట్రాక్టర్ల డ్రైవర్లు పాలాభిషేకం చేశారు. టీడీపీ నాయకులు పి.రామకుమార్, షేక్ ముస్తఫా, కౌన్సిలర్ ఎస్.రామచంద్రరాజు, కె.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే చినరాజప్ప



జంగారెడ్డిగూడెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం దర్శించుకున్నారు. ఈవో ఆర్‌వీ చందన చినరాజప్పను స్వామి శేష వస్త్రాలతో ఘనంగా సత్కరించి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందచేశారు. ఆయన అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు తెలిపారు. ఆలయంలో వివిధ సేవల రూపంలో శనివారంరూ. 86,447 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు.

నగదు చెక్కు అందించిన ఎస్పీ



ఏలూరు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐ రామచంద్రరావు అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు కార్పస్ ఫండ్ నుంచి వచ్చిన లక్ష రూపాయల నగదు చెక్కును ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఆయన సూచించారు. రామచంద్రరావు సతీమణి కె.వెంకటేశ్వరమ్మ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేరం జరగకుండా..

ఏలూరు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నేరం జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ఉత్తమమైన మార్గమని ఏలూరు సీసీఎస్ ఎస్‌ఐలు బుద్దాల శ్రీనివాసరావు, ఎపిహెచ్ శేఖర్, కె శ్రీధర్‌లు అన్నారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని రాజ్యలక్ష్మి అపార్టుమెంటులో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఐలు మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానం అందుబాటులో ఉందని ప్రతి అపార్టుమెంటుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్ళకు తాళాలు వేసి ఊర్లు వెళ్ళేటప్పుడు లాక్డ్‌హౌస్ మేనేజ్ మెంట్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని సూచించారు.

నేడు గంగానమ్మ తెప్పోత్సవం

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగేశ్వరపురం చెరువుగట్టు వద్ద గల గణేష్ కార్తికేయ గంగానమ్మ, ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆదివారం సంబరాలు నిర్వహిస్తున్నామని కమిటీ ఛైర్మన్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.



పెదపాడు మండలంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



పోలవరం మండలంలో సీసీ రోడ్ల పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాసులు



పెదనింద్రకొలనులో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

పల్లె పండుగ

రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

పెదపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వాటి రూపురేఖలను మార్చబోతున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కలపర్రులో రూ.26 లక్షలు, ఏపూరులో రూ.27 లక్షలు, వట్లూరులో రూ.55 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రభాకర్ శనివారం భూమి పూజ చేశారు. అనంతరం వట్లూరులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరు వీఎస్ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ ఎం.సుధాకర్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● పోలవరం గూటాలలో రూ.5 లక్షలు, కొత్తపట్టిసీమలో రూ.9.75 లక్షలు, పాతపట్టిసీమలో రూ.3.5 లక్షలు, పోలవరంలో రూ.9 లక్షలతో సీసీ రోడ్ల పనులను ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రారంభించినట్లు ఎంపీడీవో శ్రీనివాసు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షులు బి.కృష్ణ, నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షులు డి.నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.రాంబాబు, ఎ.రాజా, ఎం.కొండ, దవల వీరన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : పరింపూడి పంచాయతీలోని రూ.20 లక్షలలో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు కూటమి నాయకులతో కలిసి సర్పంచ్ ఎం.విజయకుమారి శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు డి.శ్రీను, ఎం.శ్రీను, ఎన్.బాబి, బి.చినరాజు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● నిడమర్రు : పల్లెటూర్లు ప్రగతిబాట పట్టనున్నాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పల్లె పండుగలో భాగంగా తోకలపల్లి, ఆముదాలపల్లి, బైనేపల్లి, పెదనింద్రకొలను, దేవర గోపవరం గ్రామాలలో సీసీ రోడ్లు పనులకు శంకుస్థాపన చేశారు. తోకలపల్లిలో రూ.50 లక్షలు, బైనేపల్లిలో రూ.13 లక్షలు ఆముదాలపల్లిలో 6.5 లక్షలు, దేవర గోపవరంలో రూ.63లక్షలు, పెదనింద్రకొలనులో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు, అనంతరం హౌసింగ్‌కాలనీలో జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న రూ.78.50 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంకు పనులకు ఎమ్మెల్యే ధర్మరాజు శంకుస్థాపన చేశారు. జనసేన నియోజకవర్గ నాయకులు వంగా రఘు, సీహెచ్.బాసిరాజు, పి.వాసురాజు, సర్పంచ్‌లు ఎం.యాకోబు, ఒ.ప్రభాకరరావు, కె.శివ , పి.సింహచలం తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం : తిరుమలదేవిపేట, మధ్యాహ్నపువారిగూడెం గ్రామాలలో రూ.70 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సర్పంచ్ గొల్లపల్లి సరోజిని, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు తోట లక్ష్మీనారాయణ, అడపా నాగరాజు, పెండ్యాల ప్రసాద్, జట్ల సత్యనారాయణ, ఆళ్ళ బాలాజీ, డాక్టర్ రాంబాబు, సింగూలూరి దొరబాబు, మధ్యాహ్నపు పెంటరావు, పాల్గొన్నారు.

● దెందులూరు : తిమ్మనగూడెంలో శ్మశాన వాటిక రోడ్డు నిర్మాణానికి తహసీల్దార్ బి.సుమతి, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మతో కలిసి టీడీపీ నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. మండల టీడీపీ పార్టీ కార్యదర్శి ఎన్.సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎం.మోహన్‌రావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వి.రాముగౌడ్, ఎం.రాంబాబు, పి.యుగంధర్, వై.నాగరాజు, పాల్గొన్నారు.

● లింగపాలెం:మండలంలోని బాదరాల-ఆసన్నగూడెం రోడ్డు పనులను శనివారం సర్పంచ్ బి.శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రజలు నరకం చూస్తున్నారని కష్టాలు తీరతాయన్నారు.

శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు



వెంకన్న చెరువు శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే

ఏలూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వందేళ్ల చరిత్ర గల వెంకన్న చెరువు శ్మశాన వాటికను మరో వందేళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.కోటి విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ప్రముఖ వ్యాపారవేత్త గుప్తా ఫౌండేషన్ అధినేత ఎం.మోహన్‌గుప్తా ఆశయాలను అమలు చేస్తామని చంటి హామీ ఇచ్చారు. వెంకన్న చెరువు శ్మశానవాటికను మోహన్‌గుప్తా, పలువురు నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. శ్మశాన వాటికలో చెత్త డంపింగ్ చేయవద్దని కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్, కార్పొరేటర్ కర్రి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎమ్.ఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, జనసేన నాయకులు నగిరెడ్డి కాశీనరేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించకుంటే చర్యలు



దెందులూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

దెందులూరు, అక్టోబరు 19 : వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా రోడ్డు రవాణా శాఖ మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్లు సురేష్‌బాబు, జి. స్వామి, నెహరా అన్నారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవరప్పాడు బ్రిడ్జి కింద, వంగూరు అడ్డరోడ్డు వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశారు.

● కుక్కునూరు : ట్రాఫిక్ రూల్స్ ప్రతీ ఒక్కరు పాటించాలని ఎస్సై రామకృష్ణ అన్నారు. అల్లూరి సీతారామరాజు ఆటోడ్రైవర్ల యూనియన్ సమావేశం కుక్కునూరులోని సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు వేగంగా వాహనాలు నడపవద్దని ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. ఆటోడ్రైవర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నాగేంద్రరావు, వై.సాయికిరణ్, పి.వెంకటేశ్వర్లు, జి.రమేష్, జి.హరీష్, డి.కృష్ణ, పాల్గొన్నారు.

రవాణా రంగ కార్మికుల సమస్యలపై పోరాటం

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రవాణా రంగ కార్మికుల సమస్యలపై పోరాడుతున్న ఆలిండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్‌ను మరింత విస్తృత పరిచేందుకుగాను సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్టు సీఐటీయు నాయకులు ఆర్.లింగరాజు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో శనివారం నగరంలోని ఫ్యాక్టరీలు మూసివేయడంతో నిరుద్యోగులుగా మారిన వేలాది మంది కార్మికులు ఆటో రంగంలో, ఇతర వాహనాల డ్రైవింగ్ రంగంలో జీవనం సాగిస్తున్నారన్నారు. మూడున్నర లక్షల మందితో విస్తరించి ఉన్నా రవాణా సౌకర్యాలు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రోజురోజుకి పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరలను అదుపు చేయలేని ప్రభుత్వం రవాణ రంగ కార్మికులపై మాత్రం అదనపు భారాలను మోపుతుందన్నారు. నిత్యం ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్న రవాణ రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బీఎన్ఎస్ 106(1)(2) చట్టాలు డ్రైవర్లపాలిట ఉరితాడుగా మారాయన్నారు. ఏలూరు నగరంలో ఆటో కార్మికుల సమస్యలపై పోరాటాలను సాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన అధ్యక్షునిగా చక్రాల అమర్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆటోలపై ఇ-చలానాను నిషేధించాలని తీర్మానించారు. సభ్యత్వాలను నమోదు చేయాలని, తీర్మానించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి, నాయకులు నత్తా వెంకటేశ్వరరావు, బొడ్డేపల్లి చంద్రశేఖర్, కోలా రాజా, ఎండీ షాన్ బాషా, అడ్డాల రాజు, నారాయణ పాల్గొన్నారు.

కళాకారులకు ప్రశంసలు

ఏలూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వరస్వామి సన్నిధి కళావేదిక పై ఏలూరు అభినయ నృత్య భారతి నాట్యాచార్య హేమసుందర్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ప్రశంసలను అందుకుంది. సిద్ధసమాధియోగా రవిశంకర్‌గురూజీ, అన్నమయ్య జానపద కళాక్షేత్రం, విజయశంకర్ స్వామిజీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. చిన్నారుల నాట్యాన్ని ప్రశంసించారు. వారిని అభినందించారు. ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి రామారావు తదితరులు చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందించారని హేమసుందర్ తెలిపారు.

విద్యార్థులకు మంచి భోజనం పెట్టండి



భోజనం రుచి చూస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాల్లో నివాసముంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆదేశించారు. తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలను శనివారం ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం చేసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులను వసతి గృహంలో అందుతున్న సదుపాయాలను అడిగారు. వసతిగృహాల నిర్వాహణ, భోజనం నాణ్యత విషయాల్లో రాజీపడవద్దని ఉపాధ్యాయులను సూచించారు.

జీవో నెం.3 పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి

ఏజెన్సీలో జీవో నెంబరు 3 పునరుద్ధరణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని గిరిజన నిరుద్యోగులు శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. మన రాష్ట్రంలో గిరిజన నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేలోగా జీవో నెం.3, ప్రత్యేక డీఎస్సీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చేలా చూడాలని లేకుంటే గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మేలు జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కె.లక్ష్మణరావు, ఎన్.శివాజీ, టి.అజయ్, కె.నవీన్‌కుమార్, టి.నాగరాజు ఉన్నారు.

విద్యార్థుల భోజనం నాణ్యతతో ఉండాలి



విద్యార్థి నుంచి వివరాలు తెలుసుకుంటున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మధ్యాహ్న అందించే భోజనం నాణ్యతతో ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ అన్నారు. నగరంలోని పలు పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్యానల్ న్యాయవాదులు కె.కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, జీవీ భాస్కర్, ఎ.గంగాభవానీ పాల్గొన్నారు.

ఎస్సీ బాలుర వసతి గృహం తనిఖీ

బుట్టాయగూడెం : జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ అథారిటీ ఛైర్మన్ సిహెచ్ కిషోర్‌కుమార్, జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కుమారి తేజస్వీని శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి హైకోర్టు దృష్టికి తీసుకువెళ్ళడానికి రిపోర్టులను తయారు చేయడంతో భాగంగా జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని వసతిగృహాలను అకస్మీకంగా తనిఖీలు చేయడం జరిగిందని న్యాయమూర్తులు తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

టి.నరసాపురం : విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని చింతలపూడి కోర్టు జడ్జి సిహెచ్.మధుబాబు సూచించారు. బొర్రంపాలెంలోని యేయి హవీలా చిల్డ్రన్ హోమ్‌ను ఎస్సై ఎం.జయబాబుతో కలిసి జడ్జి మధుబాబు ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలడిగి తెలుసుకున్నారు.పలు చట్టాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నాయకత్వ లక్షణాలపై ముగిసిన శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

ఏలూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాలపై స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. రిసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించిన ముంబయి ఫోరమ్ ఫర్ ఫ్రీ ఎంట్రప్రైజస్ ప్రతినిధులు వివేక్ పాక్కి, క్లారిసా మాట్లాడుతూ టైం మేనేజ్‌మెంట్, గోల్ సెట్టింగ్, పాజిటివ్ థింకింగ్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లతో నాయకత్వ లక్షణాలు విద్యార్థులకు అలవడతాయన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ జ్ఞానమనే సంపదను కూడబెట్టుకోవాలని, అవసరార్ధం దానికి వాడుకోవాలని సూచించారు. వివిధ కళాశాలల విద్యార్థులు, సోషల్ సైన్సెస్ విభాగాధిపతి రత్నమేరి, వైస్ ప్రిన్సిపాల్ మరియా క్రిస్టియా పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఆదినారాయణుడు



ద్వారకాతిరుమల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అశ్వవాహనంపై కొలువుతీరిన చిన్నతిరుమలేశుడు శనివారం రాత్రి క్షేత్రపురవీధుల్లో ఊరేగారు. అట్టహాసంగా జరిగిన ఈ వేడుకలో భాగంగా ముందుగా అలంకరించిన అశ్వావాహనంపై ఉభయదేవేరులతో శ్రీవారిని ఉంచి అలంకరించి హారతులిచ్చారు. ఆ తరువాత మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ వేడుక భక్తజనులకు నేత్రపర్వమైంది.

నేడు హైకోర్టు జడ్జి రాక

ఏలూరు క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి రాష్ట్ర హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి ఆదివారం ఉదయం ఏలూరు రానున్నారు. ఉదయం ఏడు గంటలకు గుంటూరు జిల్లా కాజా నుంచి కారులో బయలుదేరి 8.30 గంటలకు ఏలూరు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని సమావేశపు మందిరంలో జ్యూడీషియల్ అధికారులతో కాన్ఫరెన్సులో పాల్గొంటారు. అనంతరం అదే రోజు సాయంత్రం కారులో గుంటూరు జిల్లా నంబూరుకు బయలుదేరి వెళ్ళనున్నారు.

జిల్లాలో మంత్రి మనోహర్ పర్యటన

ఏలూరు సిటీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ నెల 21న ద్వారకాతిరుమలకు చేరుకుని స్వామిని దర్శించుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 22న ఏలూరు కలెక్టరేట్‌కు ఆయన చేరుకుని జిల్లా అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12 గంటలకు ఉంగుటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఉంగుటూరు నుంచి విజయవాడకు వెళ్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

టి.నరసాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషనల్ ఎపిసెన్సీ సంస్థ ఆధ్వర్యంలో 7,10 తరగతులు విద్యార్థులకు నిర్వహిస్తున్న ఈఈ మెరిట్ ఆన్‌లైన్ పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ సముద్రపు రాము శనివారం ఒకప్రకటలో తెలిపారు. వివరాలకు 95332 26615, 86391 70384లలో సంప్రదించాలన్నారు.

కళాశాల అక్రమాలపై ఫిర్యాదు

ఏలూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దూరవిద్య పరీక్షల్లో అవకతవకలకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలున్న ఏలూరు ఎన్‌ఆర్ పేట ఎస్‌వీఆర్‌కే కళాశాలకు యూనివర్శిటీ పరీక్ష కేంద్రాన్ని, స్టడీ సెంటర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నాగార్జున విశ్వవిద్యాలయం డిస్టెన్స్ ఎగ్జామినేషన్స్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ రామచంద్రన్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేసినట్టు పీడీఎస్‌యూ జిల్లా నాయకులు కె.నాని, ఎ.రాజేష్ తెలిపారు. పరీక్షల్లో పెద్దయెత్తున మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ప్రతీ సెమిస్టర్‌కు వేలాది రూపాయిలు వసూలు చేస్తున్నారని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ ఆరోపించారు. ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్లు ఇవ్వకుండా మానసికంగా వేదిస్తుండటంవల్ల ఇటీవల ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వివరించారు. ఈ కళాశాల కార్యకలాపాలపై నిఘా ఏర్పాటు చేసి అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఆధార్ అప్‌డేట్ సమావేశాలు

భీమడోలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ అప్‌డేట్‌లో భాగంగా ఈ నెల 22 నుంచి 25 వరకు మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. 22న చెట్టున్నపాడు, పూళ్ళ సచివాలయం -1, భీమడోలు సచివాలయం -1, 24న ఆగడాలలంక, పూళ్ళ సచివాలయం -3 ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఏలూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపుల్లో మోసాలపై శనివారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులకు మహిళా పోలీస్ స్టేషన్, ఏలూరు సైబర్‌సెల్ పోలీస్‌స్టేషన్ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఇనస్పెక్టర్ సుబ్బారావు, సైబర్‌సెల్ ఎస్‌ఐ మధువెంకటరాజు, మహిళా ఎస్‌ఐ కాంతిప్రియ మాట్లాడుతూ తేలికైన పాస్‌వర్డ్‌లు పెట్టుకుంటే సైబర్ కేటుగాళ్లచేతికి తాళాలు ఇచ్చినట్టేనన్నారు. కాగితాలపై పాస్‌వర్డ్‌ను రాసుకుని పర్సులో పెట్టుకోవడం ఎప్పుడూ చేయరాదన్నారు. సైబర్ క్రైం బారిన పడినవారు తక్షణ సాయం కోసం హెల్ప్‌లైన్ నెంబరు 1930కి కాల్ చేయడంగాని, లేదా సంబంధిత పోలీసుస్టేషన్‌లోగాని ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు స్వాధీనం

పెదపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : చికెన్ వ్యర్థాలను తీసుకువస్తుండగా పెదపాడు, పరిసర ప్రాంతాల్లో సిబ్బందితో తనిఖీలు నిర్వహించి బొలేరో, ఐషర్ వాహనాలను, వాటిలో 13 వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహన, చెరువు యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి చికెన్ వ్యర్థాలను ధ్వంసం చేసినట్లుగా ఎస్సై తెలిపారు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు నూరుశాతం జరగాలి

చింతలపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులోగాని, పార్టీ సభ్యత్వ నమోదులోగాని నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ జరగాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక ఆర్‌కే ఫంక్షన్ హాలులో చింతలపూడి, లింగపాలెం మండలాల పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు, కూటమి నాయకులకు పట్టభద్రుల గ్రాడ్యుయేట్ నమోదులో అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు జి.ముత్తారెడ్డి, ఎం.వెంకట్రామయ్య, చలపతిరావు, జి.వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్.గోపీనాథ్ రూ.లక్ష చెల్లించి పార్టీ జీవితకాల సభ్యత్వ పొందారు.

● కామవరపుకోట : తడికలపూడిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో కూటమి నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ కూటమి బలపరిచిన అభ్యర్థి ఘన విజయం సాధించేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, మండల తెలుగుదేశం అధ్యక్షుడు కె.సత్యనారాయణ, టీడీపీ నాయకులు బి.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు శంకుస్థాపన

చింతలపూడి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రగడవరం హైస్కూలు రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. టీడీపీ నాయకులు కె.రాజారెడ్డి, టి.చంద్రశేఖరరెడ్డి, అట్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కామవరపుకోట : రామన్నపాలెంలో రహదారుల అభివృద్ధికి శంకుస్థాపనలు చేశారు. తెలుగు రైతు ఏలూరు పార్లమెంటు విభాగం ఉపాధ్యక్షులు ఎం.నాగేశ్వర రాంబాబు, టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, కె.సత్యనారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

తప్పులు సరి చేసేందుకే..



టి.నరసాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

లింగపాలెం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : భూముల రీసర్వేలో తప్పులను సరి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ నజీముల్లాషా అన్నారు. పోచవరంలో రీసర్వేపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ ఎం. రాము, డీటీ యస్.నాగబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● దెందులూరు : చల్లచింతలపూడి పంచాయతీ పరిధిలోని తిమ్మనగూడెంలో తహసీల్దార్ బి.సుమతి, సర్పంచ్ బి.వెంకటేశ్వరమ్మ, ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో తొమ్మిది వినతులు వచ్చాయి.

● భీమడోలు : దుద్దేపూడిలో రీసర్వే గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ రీసర్వే పై ఎటువంటి అభ్యంతరాలున్నా గ్రామ సభలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

● టి.నరసాపుర : అప్పలరాజుగూడెంలో భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూమి ఆన్‌లైన్ పేర్లు మార్పు, భూవిస్తీర్ణం సరిచేయాలని కోరుతూ పలువురు ఫిర్యాదు చేయగా మొత్తం 78 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ టీఎస్ సాయిబాబా తెలిపారు. మండలంలో రీసర్వే చేసిన గ్రామాల్లో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు గన్నిన సురేంద్ర, నాగేంద్ర, శ్రీను, రీసర్వే డిటి శ్రవంతి, వీఆర్‌ఓలు బోస్, మాధవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఉన్న ఊరు.. పుట్టి పెరిగిన ఇంటిని వదిలి ఉండలేక, అటు పిల్లల వద్దకు వెళ్లలేక, తరుముకొస్తున్న వృద్ధాప్యాన్ని జయించలేక మదన పడుతున్న వారి సంఖ్య ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పెరుగుతోంది. 80వ పడిలో పడిన వారందరికీ ఇప్పటి జీవితం ఒక ప్రత్యక్ష నరకం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు వర్ధిల్లిన నాడు ఎవరో ఒకరు బాధ్యత భుజానకెత్తుకుని తమ వాళ్లకి ఏం వచ్చినా దండుగా నిలిచేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఒక్కసారిగా అదృశ్యమైంది.

ఒంటరి బతుకులు



పల్లెపట్నం ఇప్పుడు తేడా లేదు.. వయస్సు మళ్లితే ఇకంతే.. రెక్కలొచ్చి పిట్టల్లా పిల్లలు

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

అలవాటు చేసుకున్నా

నా వయస్సు 68 ఏళ్లు. ఆర్థిక స్థోమత లేకపోయినా పిల్లలను బాగా చదివించా. రెక్కలు ముక్కలు చేసుకుని పిల్లలను ఉన్నత విద్యకు పంపా. వారంతా విదేశాల్లో స్థిరపడ్డారు. ఎదిగిన పిల్లలను చూసి సంబరపడ్డా. వృద్ధాప్యం వచ్చిన తర్వాత ఇప్పుడు బాధపడుతున్నా. నాలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. వ్యాపారం చేశా. పిల్లలకున్నీ ఇచ్చా. పెళ్లి కాక ముందే పిల్లలపై మనకి హక్కు. పెళ్లైతే ఎవరి జీవితం వారిదే. పట్టించుకున్న వారెవరు. దేవుడి మీద భారం వేసి ఒంటరిగా బతుకేందుకు అలవాటు చేసుకున్నా. ఈ జన్మకిది చాలు.

- మోహన్‌రావు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాలం మారుతోంది. పెద్దరికం స్థానం మారుతోంది. పల్లె అయినా, పట్నమైనా.. కొందరివి ఒంటరి బతుకులే. ఒకనాడు కుటుంబ సభ్యులతో కళకళలాడిన ఇళ్లన్నీ ఇప్పుడు ఈసురోమంటున్నాయి. అడ్డాల్లోనే కాని పిల్లలు గెడ్డలొస్తే కాదనే సామెత ఇప్పుడు అక్షరాలా చాలా మందికి వర్తిస్తుంది. ఉద్యోగం కోసమో, చదువుల కోసమో, సంసార బాధ్యతల కోసమో అన్వేషిస్తూ తల్లిదండ్రులకు దూరంగా వెళుతున్న వారెందరో. నెలకో, ఆరు నెలలకో ఒకసారి వచ్చి మనసారా పలకరించే వారే లేరు. రోగం వచ్చినా, రొప్పొచ్చినా.. ఊళ్లో ఆర్‌ఎంపి ఉన్నాడు. అయనను అడిగి మందులేసుకో అదే తగ్గిపోతుంది.. అంటూ ఫోన్‌లోనే తల్లిదండ్రికి సూచనలు చేసే పిల్లలెంత మందో. కాని తమకు నలతగా ఉందని, మంచం దిగలేకపోతున్నామని, కనీసం ఎవరూ సాయపడే వారు కూడా లేరని నొక్కినొక్కి మరీ చెప్పినా అదంతా గోసే అవుతుంది. రానురాను బంధాలు, భావబంధాలు మరింతగా అల్లుకుపోవడానికి బదులుగా క్రమేపీ శిథిలమవుతున్నాయి.

కుటుంబాలు విచ్ఛిన్నం

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. వాటి స్థానంలో ఒంటరి కుటుంబాలు పుట్టుకొచ్చాయి. పెళ్ళై పట్టుమని వారం గడవక మునుపే.. అమ్మా మేం వేరే కాపురం ఉంటామంటూ పుట్టిన బిడ్డల నోటి వెంట వెలువడుతున్న మాటలకు తల్లిదండ్రులంతా అలవాటు పడిపోయారు. ఆర్భాటంగా పెళ్లి చేసినా, అష్టకష్టాలు పడి చదివించి పెద్ద చేసిన తామే అందరికీ ఓ బరువు.. ఓ అడ్డంకి అన్నట్టు బిడ్డల నోటి వెంట వెలువడుతున్న మాటలు గుండెల్లో గుచ్చుకుంటుంటే గమ్మున ఉండే వారెంత మందో. ఇక అక్కడి నుంచి మొదలైన జీవిత నాటకం ఇంటి పెద్దలకు జీవిత చరమాంకం నరకంగా మారుతోంది. ఒంటరి ప్రయాణం అటవాటవుతోంది. అదీ ఇదీ కాదంటే వృద్ధుల శరణాలయాల్లో చేతి నిండా డబ్బున్నోళ్లకు ఓ రీతిన.. చేతిలో చిల్లి గవ్వ లేని వారికి ఇంకో రీతిన అక్కున చేర్చుకుంటున్నారు. రాత్రనక, పగలనకా తాము పడిన కష్టాలు మదిలో కదులుతుంటే, కళ్లమ్మటే నీళ్లవుతుంటే.. మూడో కంటికి తెలియకుండా ఒంటరిగా వేదనతో, నిస్సహాయతతో కూలబడి ఆ దేవుడెప్పుడు తీసుకుపోతాడో అంటూ గుండెనిండా ఆర్ద్రతతో కుమిలిపోయే వారికి లోటే లేదు.

ఊరు మారింది

ఒకప్పుడు పల్లెల్లో అంతా ఒకటై ఉండేవారు. రానురాను అక్కడి పరిస్థితులు మారాయి. పార్టీల వారీగా, కులాల వారీగా కుటుంబాలు చీలిపోయాయి. ఎవరైనా హఠాత్తుగా కాలం చేసినా కాడిపట్టే వారు కొందరే. బతికినన్నాళ్ళు మమ్మల్ని పట్టించుకోలేదని ఆఖరికి నిష్ఠూరమాడే వారే కనిపిస్తారు. ఒకప్పుడు పల్లె పట్టు కాస్తా ఇప్పుడు సడలిపోయింది. కుటుంబాల మధ్య చీలిక ఒక ఎత్తయితే, ఏ కుటుంబానికి ఆ కుటుంబం ఒంటరిగా మారడం, పిల్లలు రెక్కలొచ్చి బతుకు తెరువు కోసం వేరే ప్రాంతాలకు ఎగిరిపోవడంతో పండుటాకులకు కష్టంగా మారింది. ఒంటరి బతుకులకు ఇది ఆలవాలమైంది. ఇంటి పెద్ద దిక్కు కోల్పోతే ఆ ఇంటి ఇల్లాలు ఒక్కరే మిగిలారు. పదకొండవ రోజు ఆ కార్యంకు దూరంగా ఉన్న పిల్లలు, వారి పిల్లలు అందరూ తండోప తండాలుగా వచ్చారు. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయామంటూ అంతా మదన పడ్డారు. కన్నీటిపర్యంతమయ్యా రు. 'అంతలోనే అమ్మా వెళ్ళొస్తాం.. ఆరో గ్యం జాగ్రత్తగా చూసుకో' అంటూ ఒకరు. 'అసలే పెద్దోళ్ళయ్యారు. ఏ చిన్నాచితక జలుబు గిలుబు వచ్చినా ఆసుపత్రికి వెళ్ళు. వెనకాడకు' అంటూ ఇంకొకరి ధైర్య వచనాలు. ఏమొచ్చినా మేమున్నాం కదా ఫోన్ చెయ్యి చాలు ఇంకొకరు భరోసా. ఒకరి తర్వాత మరొకరు అంతా నిష్క్రమణ. ఇంట్లో మిగిలిందల్లా వయసు మీద పడి.. గుండెలనిండా బాధలు అలుముకుని భవిష్యత్ ఏమిటో తెలియక.. బావురమందామన్నా పెద్దరికం అడ్డొచ్చి గొంతెలో ఏదో అడ్డుపడ్డట్టు ఆ ఇంటి పెద్దావిడ పరిస్థితి. ఇంతలా కుటుంబాలకు కుటుంబాలే ఒంటరితనాన్ని ఆవహిస్తున్నాయి.

ఇదే నా.. జీవితం

నా వయస్సు 69 ఏళ్ళు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. మావారు కన్నుమూసిన తరువాత నానా తిప్పలు పడి పిల్లలను ప్రయోజకులను చేశా. అన్నీ సమ కూర్చా. ఆయన పోయిన తర్వాత ఎవరూ నన్ను పట్టించుకోలేదు. పిల్లలు వేరేచోట ఉంటున్నారు. నేను వారి దగ్గరకు వెళ్లి ఉండలేను. పుట్టిన ఊరిపై మమకారం చంపుకోలేను. ఒంటరిగా బతుకుతున్నా. వయస్సు మీద పడి నానా తిప్ప లు పడుతున్నా. అయినా అలవాటు చేసుకున్నా. సొంత ఊరైతే ఎలాగోలా పొద్దుపోతుంది. పట్నం లో అయితే అలా కాదు కదా. కనీసం నన్ను చూడడానికి కూడా కన్నబిడ్డలే వంతు లేసుకుంటున్నారు. ఇదే నా జీవితం.

- సత్యవేణి



పాద పూజలు

ఆటల పోటీలు

అవ్వా తాతల దినోత్సవం

ఉంగుటూరు/పెదపాడు/బుట్టాయగూడెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమైన తర్వాత.. తాత, నాయనమ్మలు దూరమయ్యారు. పండుగకో పబ్బానికో ఓసారి వెళ్లి పలకించడమే తప్ప వారి ప్రాధాన్యాన్ని ఈ తరం పిల్లలు మర్చిపోతున్నారు. గ్రాండ్ పేరెంట్స్ డే దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమలోని పలు పాఠశాలల్లో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు ఫౌండేషన్ స్కూలులో అవ్వా తాతలతో తమ బాల్య స్మృతులను పిల్లలకు చెప్పించారు. అల్లు శ్రీను ఆధ్వర్యంలో మ్యూజికల్ ఛైర్స్, అష్టా చెమ్మా, క్యారమ్స్ పోటీలు నిర్వహించి గెలిచిన సీహెచ్ లక్ష్మి, నాగమ్మ, పాండ్రంకి లక్ష్మి, దువ్వారపు దుర్గమ్మ, పాండ్రంకి కొండలరావులకు బహుమతులు అందించారు. పెదపాడు హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుటుంబ పెద్దలను అందరూ గౌరవించాలని, వారు ఆరోగ్యంగానే ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అవ్వా తాతలకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలను సన్మానించారు. బుట్టాయగూడెం విద్యారోహిణి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం పేరెంట్స్ డే ను ఘనంగా నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

భూ రీ సర్వే గ్రామసభల్లో అధికారులు



తాడినాడ భూ రీ సర్వే గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

కలిదిండి/ ముదినేపల్లి (కైకలూరు)/ ముసునూరు/ చాట్రాయి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వేలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. శనివారం తాడినాడలో భూ రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై 85 మంది రైతులు అర్జీలు సమర్పించారు. సర్పంచ్ టి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ శ్యామల, సర్వేయర్ మహమ్మద్ షమి, వీఆర్వో గంగాధర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం వడాలి, పెదకామనపూడి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించారు. భూముల రీసర్వేలో జరిగిన పొరపాట్లు, లోపాలను అధికారులు సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని నియోకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. ఉమ్మడి ఎల్‌పీ నెంబర్ల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులు వివరించారు. తహసీల్దార్ సుభానీ, సిబ్బంది పాల్గొన్నారు. ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన రీ సర్వేపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే అర్జీల రూపంలో ఇవ్వాలని ఇన్‌చార్జ్ తహశీల్దార్ పురుషోత్తమశర్మ అన్నారు. శనివారం కొర్లకుంట సచివాలయం వద్ద రీ సర్వే గ్రామసభను నిర్వహించారు. రైతుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 16 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ నక్కనబోయిన సత్యనారాయణ, ఆర్‌ఐ దీపిక, వీఆర్వో పద్మ, గ్రామ సర్వేయర్ కంచర్ల శంకరరావు తదితరులు పాల్గొన్నారు. రీసర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చాట్రాయి తహసీల్దార్ ప్రశాంతి కోరారు. మండలంలోని పోతనపల్లి సచివాలయంలో జరిగిన రీసర్వే గ్రామసభలో ఆమె మాట్లాడుతూ రీసర్వేకి సంబంధించి సమస్యలు ఉంటే అర్జీలు ఇస్తే క్షేత్రస్థాయి పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. వివిధ భూసమస్యలపై 30 మంది రైతులు అర్జీలు సమర్పించారు. డీటీ గీత, సర్వేయర్ లక్ష్మీనారాయణ, వీఆర్వో సత్యనారాయణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 19: ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణం చెల్లించాలని సెకండ్రీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ సత్యం అన్నారు. నూజివీడులో ఎస్టీటీఎఫ్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చెల్లించాల్సిన డీఏ, ఎరియర్స్, సరెండ్రీ లీవుల బకాయిలను నగదు రూపంలో చెల్లించాల్సి ఉందని పీఎఫ్ లోన్స్ ఏపీజీఎల్ లోన్స్ వెంటనే క్లీయర్ చేయాలన్నారు. ఈసమావేశంలో ఎస్టీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

మండవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కైకలూరు సీనియర్ న్యాయసేవాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మీ అన్నారు. మండవల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని, బాలుర వసతిగృహాన్ని శనివారం తనిఖీ చేసి వసతులను పరి శీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్, హాస్టల్ వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రాభివృద్ధి

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్

ఉంగుటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. శనివారం చేబ్రోలులో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి సమాచారం రాబట్టారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి, సభ్యత్వ జిల్లా ప్రముఖ్ శరణాల మాలతీరాణి మాట్లాడుతూ మోదీ సర్కారు ద్వారా రాష్ట్రాభివృద్ధి జరుగుతున్నదన్నారు. చేబ్రోలు సర్పంచ్ రాంధే లక్ష్మీసునీత, ఎంపీటీసీలు, పార్లమెంటు కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. తొలుత దీన్‌దయాళ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించారు. నియోజకవర్గానికి వచ్చిన సిద్ధార్థనాథ్ సింగ్‌ను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కలిసి అభినందించారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

ఏలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా సభ్యత్వ నమోదుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. శనివారం ఏలూరులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన క్రియాశీల సభ్యత్వ జిల్లా కార్యశాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకు 82 వేల సభ్యత్వాలు పూర్తయ్యాయన్నారు. ఈ నెలాఖరుకు లక్షకుపైనే సభ్యత్వాలు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ్యత్వ రాష్ట్ర ప్రముఖ్ గారపాటి సీతారామాంజనేయచౌదరి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో ఏలూరు జిల్లా ప్రముఖ స్థానంలో ఉండేలా కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇతర నియోజకవర్గాల్లో తాను పర్యటించి సభ్యత్వ నమోదుకు కృషి చేస్తానన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్ర ప్రకాష్, మట్టా ప్రసాద్, శరణాల మాలతీరాణి, కట్నేని కృష్ణప్రసాద్, జిల్లా పదాధికారులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరు రోడ్ల అభివృద్ధికి చర్యలు



కొల్లేరు రోడ్ల దుస్థితిని ఎమ్మెల్యే కామినేనికి వివరిస్తున్న లంక గ్రామాల ప్రజలు

కైకలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు గ్రామాల రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో శనివారం రాష్ట్ర టీడీపీ వడ్డీసాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో కొల్లేరు గ్రామాల పెద్దలు ఎమ్మెల్యే కామినేని దృష్టికి రోడ్ల సమస్యను తీసు కొచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వరదల్లో ధ్వంసమైన రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. ఇప్పటికే రూ.4.20 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని త్వరలోనే ఈ పనులన్నీ ప్రారంభమవుతాయన్నారు.

పల్లె పండుగ వారోత్సవాలు



మండవల్లిలో శంకుస్థాపన చేస్తున్న దుర్గాప్రసాద్

కలిదిండి/ మండవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సంతోషపురం, అమరావతి, పడమటిపాలెం, లోడిదలంక గ్రామాల్లో రూ.32 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు సర్పంచ్‌లు, కూటమి నాయకులు శనివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్‌లు నాగలక్ష్మీ, భోగేశ్వర రావు, బండి సత్య నారాయణ, ఉపాధి ఏపీవో ఆనంద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. మండవల్లి మండలం ఇంగిలిపాకలంక, నాగభూషణపురం, గురువెల్ల పేట గ్రామాల్లో శనివారం పల్లెపండుగ సందర్భంగా సిమెంట్‌రోడ్లు శంకుస్థాపన చేశారు. కైకలూరు నియోజకవర్గ ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ ఎం.విజయనిర్మల, సర్పంచ్ జి.రత్నకుమారి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



తుమ్మగూడెంలో తాతమ్మకు సన్మానం

ముసునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల తాతలు, నానమ్మలు, అమ్మమ్మలను పాఠశాలలకు ఆహ్వానించి ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. గోపవరం ఎంపీపీ పాఠశాలలో పెద్దలను ఎంఈవో బీబీఎస్ సుబ్బారావు సన్మానించారు.

● చాట్రాయి : జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. పలువురు గ్రాండ్ పేరెంట్స్‌ను సన్మానించారు. హెచ్‌ఎం వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు గ్రాండ్ పేరెంట్స్ నుంచి మంచిని నేర్చుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఉద్బోధించారు.

పశుగ్రాస పెంపకానికి ప్రోత్సాహం

చాట్రాయి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద అమలు చేస్తున్న పశుగ్రాస పెంపకం పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, సన్నకారు రైతులు వినియోగించుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు, మండల బీజేపీ నాయకుడు విద్యాధరరెడ్డి కోరారు. శనివారం బీజేపీ నాయకులు మాట్లాడుతూ రైతులు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కేంద్ర ప్రభుత్వం ఈ అమలులోకి తెచ్చిందని ఒక్కో రైతు 10 సెంట్ల నుండి 50 సెంట్ల వరకు పశుగ్రాసం సాగు చేసుకుంటే రెండేళ్ళ పాటు రాయితీలు ఇస్తారని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఈ పథకాన్ని రూపకల్పన చేశారని, ప్రతి రైతు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆక్వాకు ఆక్సిజన్ గండం

కలిదిండి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో రొయ్యల చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ లోపించి రొయ్యలు మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. రొయ్యలకు గిట్టుబాటు ధర లభించడంతో గంపెడాశతో రొయ్యల సాగు చేపట్టారు. ప్రస్తుతం పలు చెరువుల్లో పట్టుబడి దశలో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురిస్తే ఆక్సిజన్ లోపించి రొయ్యల చనిపోయి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ముందస్తుగా రైతులు అద్దె జనరేటర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆక్సిజన్ టాబ్లెట్స్‌ను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకుంటున్నారు. వీటికి అదనపు వ్యయమవుతోందని రైతులు వాపోతున్నారు.

గొర్రెలు, మేకలు కాపరుల ఆర్థికాభివృద్ధికి కృషి



గుడిపాడులో జీవాలకు నట్టల మందు వేస్తున్న టీడీపీ నాయకులు

ముసునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల కాపరులను అన్ని విధాల ఆదుకుని, వారి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నాయకులు అన్నారు. గుడిపాడులో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, నాయకులు మందలపు ధర్మరాజు, వలసపల్లిలో సర్పంచ్ చలసాని దామోదరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షులు మేదరమెట్ల సురేంద్ర శనివారం జీవాలకు నట్టల నివారణ మందును వేసి లాంఛనంగా ప్రారంభించారు. గుడిపాడులో 20 మంది రైతులకు గాను 900 గొర్రెలు, 700 మేకలకు, వలసపల్లిలో 300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును పశువైద్య సిబ్బంది వేసినట్లు పశువైద్యాధికారి వెంకట చైతన్య తెలిపారు. గొర్రెల కాపరులకు ప్రభుత్వ ఉచితంగా దాణా, మందులను అందించడం తోపాటు సబ్సిడీపై అనేక పథకాలను అమలు చేస్తోందని నాయకులు అన్నారు. ఈ కార్యాక్రమంలో వెటనరీ అసిస్టెంట్ రత్నవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

కైకలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికలకు వివాహాలు చేసేందుకు ప్రయత్నిస్తే సమీపాన ఉన్న ప్రజలు పోలీసులకు సమాచారమివ్వాలని కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ సూచించారు. భుజబలపట్నం జడ్పీ హైస్కూల్లో శనివారం విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, బాల్య వివాహాల రద్దు, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చట్టరీత్యా ఆడపిల్లకు 18 ఏళ్లు నిండే వరకు పెళ్లి చేయకూడదన్నారు. రూరల్ ఎస్‌ఐ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : బాల్య వివాహాల పట్ల గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు నిరంతరం నిఘాతో వ్యవహరించాలని నూజివీడు ఆర్డీవో ఎమ్.వాణి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధక చట్టం 2006పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కుటుంబాలలో బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.ఎ.వి.ఎల్ పద్మావతి, సీడీపీవో డాక్టర్ నూరాని, ఎంపీడీవోలు, ఎమ్మీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కైకలూరులో చేపల చెరువు లీజు వివాదం



పోలీసులకు తమ సమస్యను తెలుపుతున్న రైతులు

కైకలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఓ చేపల చెరువు లీజు వ్యవహారంలో వివాదం చోటు చేసుకుంది. కైకలూరులోని తమకు చెందిన సుమారు వందెకరాల చేపల చెరువుకు లీజు తక్కువగా ఇస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తూ శనివారం ఆందో ళన నిర్వహించారు. మూడేళ్ల క్రితం రైతుల నుంచి బలవంతంగా లీజు అగ్రిమెంటు రాయించుకున్నారని గతంలో ఎకరానికి రూ.85 వేలు లీజు వచ్చేదని ప్రస్తుతం రూ.60 వేలు ఇస్తున్నారని తమకు న్యాయం చేయాలంటూ వాపోయారు. చెరువులో మేత కట్టే పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ చెరువు వివాదం రాజకీయ రంగు పులుముకోవడంతో కైకలూరు టౌన్ పోలీసులు ఘటనా స్థలికి వచ్చారు. భూ వివాదంలో తాము జోక్యం చేసుకోమని, సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించు కోవాలని సూచించారు.

కానుకొల్లులో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు



విష్ణుమూర్తి శ్రీనుకు టీడీపీ కండువా కప్పుతున్న దుర్గాప్రసాద్

మండవల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : కానుకొల్లు గ్రామ వైసీపీ అధ్యక్షుడు విష్ణుమూర్తుల శ్రీను కైకలూరు నియోజకవర్గం ఎన్డీయే నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పలువురు వైసీపీ కార్యకర్తలూ టీడీపీలో చేరారు. గూడవల్లి కోటేశ్వరరావు, రాయగిరి రాము, కోసూరి మాణిక్యాలరావు, మారడాని సూర్యనారాయణ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సు సర్వీసు



ముసునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రమణక్కపేట గ్రామానికి మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో హైదరాబాద్ బస్ సర్వీస్ స్టాప్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి రమణక్కపేట వచ్చిన నూతన బస్సుకు టీడీపీ గ్రామ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, జనసేన సెంట్రల్ ఆంధ్రజోన్ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి సర్వీసును ప్రారంభించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావ్, ఆర్యవైశ్య మండల అధ్యక్షులు గోళ్ళ రమేష్, కూటమి నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నాఉ.

ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు



నూజివీడు టౌన్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 19: ఆరోగ్య సంక్షరణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించుకొని అనేక ఉద్యోగ అవకాశాలను సృష్టించుకునే అవకాశముందని నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్ర కుమార్ అన్నారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి కల్పించే ఉద్దేశంతో ఐఐటీ మద్రాసు సహకారంతో పీయూసీ విద్యార్థులకు డేటా సైన్స్, ఏఐపై 8 వారాల వర్క్‌షాపును ప్రారభించారు. ఈ కార్యక్రమంలో 235 మంది విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోగా వర్క్‌షాపు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. పి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగించిన తీరుపై నిరసన

ముదినేపల్లి (కైకలూరు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ముదినే పల్లిలో అధికారులు అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన తీరు సరైనది కాదంటూ పలు సంఘాల నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ నెల 17న ముదినేపల్లి సెంటర్లో అంబేడ్కర్ విగ్రహాన్ని క్రేన్లతో తీసుకువెళ్లిన విధానం సరైన కాదంటూ విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ నిమ్మగడ్డ భిక్షాలు, మాలమహానాడు జిల్లా అధ్య క్షులు భూపతి రవీంద్ర, ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ భిక్షాలు విమర్శించారు. అనంతరం మాలమహానాడు మండలశాఖ అధ్యక్షుడు పాగోలు విజయసాగర్ ఆధ్వర్యంలో ముదినేపల్లి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసి తహసీల్దార్‌కు మెమొరాండం అందించారు.

బాణసంచా అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు

కైకలూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నివాస గృహాల మధ్యన అనధికారికంగా బాణసంచా నిల్వ ఉంచితే చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్ హెచ్చరించారు. కైకలూరు పోలీసుస్టేషన్లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు ముందస్తుగానే ఆర్డీవో అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకే విక్రయాలు జరగాలని హెచ్చరించారు. అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రిని ఇంటిలో ఉంచడంతో ముదినేపల్లి మండలంలో ఒక కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూరల్ ఎస్‌ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.